విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు..

PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :171 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | శుక్రవారం 6 నవంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool



తిరుమల లడ్డూ కేసు..

ఏపీ వెలుపలకు బదిలీకి సుప్రీం నో!

- విచారణ మరో రాష్ట్రానికి మార్చాలన్న పిటిషన్ కొట్టివేత
- సిట్ దర్యాప్తు కొనసాగుతున్నందున జోక్యం చేసుకోబోమని స్పష్టీకరణ
- సాక్షులు, ఆధారాలన్నీ ఏపీలోనే ఉన్నాయన్న ధర్మాసనం

న్యూఢిల్లీ

తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ కేసులో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసు ట్రయల్ విచారణను ఆంధ్రప్రదేశ్ నుంచి మరో రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసింది. విచారణను ఏపీ వెలుపలకు మార్చాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. మహారాష్ట్రకు చెందిన మాల్‌గంగా మిల్క్ అండ్ ఆగ్రో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మచింద్ర శాంతారామ్ .. వివరాలు 2లో..

చైర్‌పర్సన్లుగా కొత్త ముఖాలు

- సామాన్యులకు మున్సిపల్ పీఠాలు..
- కూటమి కొత్త ప్రయోగం!
- ట్యాక్సీ డ్రైవర్ నుంచి నర్సు వరకు..
- గృహిణులు, వైద్యులు, సాధారణ కుటుంబాల వారికి అవకాశం
- రాజకీయ నేపథ్యం, ఆర్థిక బలం లేకున్నా ప్రజా మద్దతుతో విజయం



అమరావతి

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధించడంతో పాటు, పలు పట్టణాల్లో సామాన్య కుటుంబాల నుంచి వచ్చిన అభ్యర్థులకు చైర్‌పర్సన్ పదవులు దక్కడం చర్చనీయాంశంగా మారింది. రాజకీయ వారసత్వం, అంగబలం, ఆర్థిక స్థోమత ఉన్నవారికే పదవులు దక్కుతాయనే అభిప్రాయానికి భిన్నంగా, సాధారణ వృత్తుల్లో ఉన్నవారికి కూటమి పార్టీలు అవకాశం కల్పించాయి. ట్యాక్సీ డ్రైవర్లు, నర్సులు, వైద్యులు, గృహిణుల కుటుంబాల నుంచి వచ్చిన అభ్యర్థులు మున్సిపల్ పీఠాలను అధిష్ఠించారు. ఎన్నికల్లో భారీగా ఖర్చు చేసే ఆర్థిక స్థోమత లేకపోయినా ప్రజల మద్దతుతో విజయం సాధించడం విశేషం. పుట్టపర్తి మున్సిపల్ ఛైర్మన్‌గా ఎన్నికైన మేకల వివరాలు 2లో..



అధికారం కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తుంది

- గోకుల్ డెయిరీ వివాదంపై రాహుల్ విమర్శలు
- ఎన్నికల తర్వాత నిబంధనలు మార్చిందని ఆరోపణ
- 25 స్థానాల్లో కాంగ్రెస్ ప్యానెల్‌కు 13 సీట్లు
- బోర్డులో నామినేటెడ్ సభ్యుల నియామకంపై వివాదం
- సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్న పవన్ ఖేడా



పారా క్రీడల్లో భారత్ పతకాల ప్రభంజనం!

- 14 నుంచి 114కు.. పారా అథ్లెట్ల సత్తా!
- మీరు దేశాన్ని గర్వపడేలా చేశారు
- ఆసియా పారా గేమ్స్‌లో భారత క్రీడాకారుల ఘనత
- 30 స్వర్ణాలు, 35 రజతాలు, 49 కాంస్య పతకాలు
- ఐదు ప్రపంచ రికార్డులు.. తొమ్మిది ఆసియా రికార్డులు
- మహిళా అథ్లెట్ల ప్రదర్శనపై ప్రధాని ప్రశంసలు



ఏడు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో

ఓటర్ల జాబితా సవరణ

- యువ ఓటర్ల నమోదుకు ఈసీ కీలక నిర్ణయం
- నవంబర్ 30న ముసాయిదా జాబితా ప్రచురణ
- 2027 జనవరి 21న తుది ఓటర్ల జాబితా
- ఆధార్ సమర్పణ స్వచ్ఛందమేనని స్పష్టీకరణ
- ఓట్ల తొలగింపుపై క్షేత్రస్థాయి విచారణ తప్పనిసరి



ధైర్యముంటే ప్రధానికి లేఖ రాయండి

- రాహుల్‌కు అమిత్ షా సవాల్..
- పార్లమెంట్ ప్రత్యేక సమావేశానికి సిద్ధమని ప్రకటన
- ఎస్ఐఆర్, ఈవీఎంలపై చర్చకు సిద్ధమని వెల్లడి
- చొరబాటుదారుల ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్‌కు ప్రశ్న
- పార్లమెంట్‌ను అడ్డుకుంటున్నారంటూ విమర్శలు
- ఓటర్ల జాబితా సవరణను సమర్థించిన సీఎం సైనీ



నామినేషన్ల నుంచి ఫలితాల వరకు అక్రమాలే

- చంద్రబాబు గెలిచి ఓడారు.. మేం ఓడి గెలిచాం!
- స్థానిక ఎన్నికల్లో అక్రమాలు జరిగాయంటూ వైఎస్ జగన్ ఆరోపణలు
- పోలింగ్ శాతాల పెరుగుదలపై అనుమానాలు.. బ్యాలెట్ బాక్సులపైనా ప్రశ్నలు
- తుపాన్ల నష్టంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శ

తాడేపల్లి

స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కూటమి అక్రమాలకు పాల్పడిందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. వివరాలు 2లో..

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



- ఎన్నికల బరిలో నిలిచిన 21,012 మంది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం
- 582 జడ్పీటీసీ, 7,767 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు
- 77 జడ్పీటీసీ, 2,051 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవం
- నేడు రీపోలింగ్.. 7న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు
- 40 వేల మందికి పైగా పోలీసులతో భద్రత

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో కీలక ఘట్టమైన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. కొన్ని ప్రాంతాల్లో వర్షం కారణంగా ఉదయం పోలింగ్ మందకొడిగా సాగినా, మధ్యాహ్నం నుంచి వివరాలు 2లో..

దేశవ్యాప్తంగా వందే భారత్ హవా..

- నిండిపోతున్న సీట్లు, స్లీపర్లకు ఫుల్ డిమాండ్
- 2025-26 ఆర్థిక సంవత్సరంలో వందే భారత్ రైళ్లకు భారీ స్పందన
- తిరువనంతపురం-మంగళూరు రూట్‌లో 189% రికార్డు స్థాయి ఆక్యుపెన్సీ
- తొలి వందే భారత్ స్లీపర్‌కు కూడా 114% పైగా ఆక్యుపెన్సీ నమోదు



కొరియాలో ఒడిశా పోలీసుల

ఆగడాలు సహించం!

- గిరిజనుల ఓటు హక్కును అడ్డుకోవద్దు.. మంత్రి సంధ్యారాణి హెచ్చరిక
- 29 గ్రామాల్లో బెదిరింపులు, దాడులు, కిడ్నాప్‌లకు పాల్పడుతున్నారని ఆరోపణ
- సరిహద్దును భారత్-పాక్ సరిహద్దులా మార్చొద్దని హితవు



కొరియా

ఆంధ్రప్రదేశ్-ఒడిశా సరిహద్దులోని వివాదాస్పద కొరియా గ్రామాల్లో మరోసారి ఉద్రిక్తత నెలకొంది. ఎన్నికల సమయంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వెళుతున్న గిరిజనులను ఒడిశా పోలీసులు అడ్డుకుంటున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కొరియా గ్రామాల్లో పర్యటించి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ఒడిశా అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొరియాలోని 29 గ్రామాల్లో ఒడిశా అధికారులు, పోలీసుల . వివరాలు 2లో..

విదేశీయుల పాస్‌పోర్ట్, వీసా నిబంధనల్లో సడలింపు

- పాక్ పౌరులు, మైనార్టీ శరణార్థులకు ఊరట..
- శ్రీలంక తమిళులు, టిబెటన్లకూ మినహాయింపులు
- కేరళలో స్థిరపడిన వారికి మరో మినహాయింపు
- భారత మూలాలున్న మలేసియా, సింగపూర్ పౌరులకూ



నామినేషన్ల నుంచి ఫలితాల వరకు అక్రమాలే

-మొదటిపేజీ తరువాయి

పోలింగ్ శాతాలను రాత్రికి రాత్రే పెంచి చూపించి గెలుపును తమ ఖాతాలో వేసుకున్నారని విమర్శించారు. చంద్రబాబు గెలిచినా నైతికంగా ఓడిపోయారని, తాము ఓడినా ప్రజల తరఫున పోరాడి గెలిచామని వ్యాఖ్యానించారు. ఎన్నికలు సజావుగా జరిగి ఉంటే టీడీపీ గెలిచేదా? అని ప్రశ్నించారు.

పోలింగ్ శాతాల పెరుగుదలపై ప్రశ్నలు

విశాఖపట్నంలో రాత్రికి రాత్రే 1,15,887 ఓట్లు ఎలా పెరిగాయని జగన్ ప్రశ్నించారు. సోమవారం ఉదయానికి పోలైన ఓట్ల సంఖ్య 1,35,154కు ఎలా చేరిందని నిలదీశారు. రాత్రి 51.46 శాతంగా ఉన్న పోలింగ్ మరుసటి ఉదయానికి 56.03 శాతానికి ఎలా పెరిగిందని ప్రశ్నించారు. చీమకుర్తిలో రాత్రి 11 గంటలకు 78.28 శాతంగా ఉన్న పోలింగ్ అర్ధరాత్రి 12 గంటలకు 84.36 శాతానికి ఎలా చేరిందని అన్నారు. జమ్మలమడుగులో ఉదయం 11 గంటలకే 60 శాతం పోలింగ్ ఎలా నమోదైందని, అద్దంకిలో ఉదయం 11 గంటలకు 19 శాతంగా ఉన్న పోలింగ్ మధ్యాహ్నం ఒంటి గంటకు 56 శాతానికి ఎలా పెరిగిందని ప్రశ్నించారు. ధర్మవరంలో రెండు గంటల్లో 8 శాతం నుంచి 36.36 శాతానికి, పార్వతీపురంలో 12 శాతం నుంచి 44 శాతానికి పోలింగ్ ఎలా పెరిగిందని నిలదీశారు.

నామినేషన్ల నుంచి ఫలితాల వరకు అక్రమాలే

ఎన్నికల ప్రక్రియలో అడుగడుగునా అక్రమాలు జరిగాయని జగన్ ఆరోపించారు. నామినేషన్లు, స్క్రూటినీ, పోలింగ్



బూత్‌లు, పోలింగ్ శాతాలు, బ్యాలెట్ బాక్సులు, చివరకు ఫలితాల ప్రకటనలోనూ అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించిన బ్యాలెట్ బాక్సులకు సైతం సీళ్లు వేయలేదని ఆరోపించారు. తమ అభ్యర్థులు గెలిచిన చోట్ల కూడా ఫలితాలను తారుమారు చేశారని ధ్వజమెత్తారు. యువతరానికి సైతం రిగ్గింగ్, పోలింగ్ అక్రమాలపై శిక్షణ ఇస్తున్నట్లుగా చంద్రబాబు ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

'ఏపీ ఫర్ సేల్‌గా మారింది'

చంద్రబాబు పాలనలో ఆంధ్రప్రదేశ్ అమ్మకానికి పెట్టినట్లుగా మారిందని జగన్ విమర్శించారు. ప్రభుత్వ భూములను 99 పైసలకే కట్టబెట్టారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా మద్యం, గంజాయి సమస్యలు కనిపిస్తున్నాయని అన్నారు. రాజధాని సహా పలు రంగాల్లో అవినీతి, కుంభకోణాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. ఏపీని 'సౌత్ బిహార్'తో పోలుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కార్యకర్తల పోరాటానికి సెల్యూట్

ప్రజల తరఫున తమ పార్టీ బలంగా గొంతు వినిపించిందని జగన్ అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అక్రమాలను దేశం దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో తమ పార్టీ కార్యకర్తలు, నాయకులు ధైర్యంగా పోరాడారని ప్రశంసించారు. వారి పోరాటానికి సెల్యూట్ చేస్తున్నట్లు తెలిపారు.

తుపాన్ల నష్టంపై ప్రభుత్వాన్ని నిలదీత

మొరసు తుపాను ప్రభావం ఉన్నప్పటికీ ఎన్నికలను వాయిదా వేయలేదని జగన్ విమర్శించారు. తుపాను సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడటమే ప్రభుత్వానికి ప్రధాన ప్రాధాన్యంగా ఉండాలని అన్నారు. అర్నబ్ తుపాను కారణంగా పది మందికి పైగా మరణించారని, 150 గ్రామాలకు ఇప్పటికీ విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేదని ఆరోపించారు. మురసు తుపాను కారణంగా ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తగిన సాయం అందించలేదని విమర్శించారు. 13 నెలల క్రితం వచ్చిన మోంథా తుపాను నష్టపరిహారానికి సంబంధించి జీవోలు జారీ చేసినప్పటికీ, బాధితులకు నగదు అందలేదని జగన్ ఆరోపించారు.

చైర్‌పర్సన్లుగా కొత్త ముఖాలు

-మొదటిపేజీ తరువాయి

ఈశ్వర్ ట్యాక్సీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. జనసేన ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్న ఆయనకు ఈ ఎన్నికల్లో పార్టీ అవకాశం కల్పించింది. ఎన్నికల ఖర్చులు భరించడం కూడా ఆయనకు సవాలుగా మారింది. కొన్ని ఖర్చుల కోసం అప్పులు చేయగా, మరికొందరు ఆర్థికంగా సహకరించారు. చివరకు ఓటర్ల మద్దతుతో పుట్టపర్తి ఛైర్మన్ పీఠాన్ని దక్కించుకున్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ భార్యకు అవకాశం

ఏలేశ్వరం ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన యార్లగడ్డ అక్షితది సాధారణ కుటుంబం. ఆమె భర్త ప్రభుత్వ ఆసుపత్రిలో పార్ట్‌టైమ్ ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. కుటుంబానికి రాజకీయ నేపథ్యం లేకపోయినా టీడీపీ ఆమెకు అవకాశం కల్పించింది. ప్రజల మద్దతుతో అక్షిత విజయం సాధించి ఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు.

నర్సు నుంచి మున్సిపల్ పీఠానికి

నిడదవోలు ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన మురాల జ్యోతి గతంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేశారు. ఆమె భర్త టైల్స్ మేస్త్రీగా జీవనం సాగిస్తున్నారు. ఈ స్థానం రిజర్వేషన్ మార్పుతో ఎస్సీ మహిళకు కేటాయించడంతో జ్యోతికి పోటీ చేసే అవకాశం లభించింది. జనసేన ఆమెకు టికెట్ ఇవ్వగా, ఎన్నికల్లో విజయం సాధించి ఛైర్‌పర్సన్ పీఠాన్ని దక్కించుకున్నారు.

సామాజిక సేవకు గుర్తింపుగా..

తుని ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన ఎస్.శ్రీలత సాధారణ గృహిణి.



ఆమె భర్త ప్రసాద్ సెల్‌ఫోన్ దుకాణం నిర్వహిస్తూ స్థానికంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. బీసీ మహిళకు రిజర్వు అయిన ఈ స్థానంలో జనసేన శ్రీలతకు అవకాశం కల్పించింది. ఆర్థికంగా పెద్దగా అండదండలు లేకపోయినా పార్టీ మద్దతుతో ఎన్నికల బరిలో నిలిచి విజయం సాధించారు.

గృహిణులకు రాజకీయ అవకాశం

ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన కన్నెగంటి అమూల్యకు రాజకీయ నేపథ్యం లేదు. బీటెక్ చదివిన ఆమె గృహిణిగా ఉంటున్నారు. ఆమె భర్త సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కాగా, తండ్రి వీటీపీఎస్ విశ్రాంత ఉద్యోగి. టీడీపీ ఆమెకు అవకాశం కల్పించడంతో ఎన్నికల్లో విజయం సాధించారు. కడప జిల్లా ఎర్రగుంట్ల ఛైర్‌పర్సన్‌గా బీజేపీ తరఫున మధులత ఎన్నికయ్యారు. ఆమె భర్త ప్రైవేటు ఉద్యోగి. ఈ కుటుంబానికీ రాజకీయ నేపథ్యం లేదు.

వైద్యులకూ దక్కిన పీఠాలు

మున్సిపల్ ఎన్నికల్లో వైద్యులు కూడా ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యారు. నంద్యాల మున్సిపల్ ఛైర్మన్‌గా పిల్లల వైద్యుడు బాబన్ ఎన్నికయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా డాక్టర్ షేక్ నీలోఫర్ విజయం సాధించారు. ఆమె కుటుంబానికి రాజకీయ నేపథ్యం లేకపోయినా, భార్యాభర్తలిద్దరూ స్థానికంగా వైద్యులుగా సేవలందిస్తున్నారు. ఇలా వివిధ వృత్తుల్లో ఉన్నవారికి మున్సిపల్ పీఠాలు దక్కడంతో స్థానిక రాజకీయాల్లో కొత్త ముఖాలకు ప్రాధాన్యం లభించినట్లయింది.

ఆ ఐదే... సక్సెస్ ఫార్ములా...

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల సమరంలో టీడీపీ-జనసేన-బీజేపీల ఎన్డీయే కూటమి తిరుగులేని ప్రభంజనాన్ని సృష్టించింది. కార్పొరేషన్లు మొదలుకుని నగర పంచాయతీల వరకు రాష్ట్రవ్యాప్తంగా పట్టణ స్థానిక సంస్థల్లో కూటమి అభ్యర్థులు ఏకపక్ష విజయాలను నమోదు చేశారు. మరోవైపు ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అతి కష్టం మీద కేవలం మూడు మున్సిపల్ చైర్మన్ పీఠాలకే పరిమితమై అస్తిత్వ సంక్షోభంలో కూరుకుపోయింది. సాధారణంగా అధికారం మారిన కొత్తలో స్థానిక సంస్థల ఎన్నికలు ఏకపక్షంగా ముగుస్తాయన్నది నానీనికి ఒక వైపే, కానీ క్షేత్రస్థాయిలో కూటమి సాధించిన ఈ అపూర్వ స్వీప్‌కు కేవలం అధికార బలమే కారణం కాదు. పకడ్బందీ వ్యూహం, బలమైన ఐక్యత, ప్రజామోదం కలగలసిన ఐదు ప్రధాన అంశాలే కూటమి విజయ ధంకా మోగించడానికి దారితీశాయి.కూటమి విజయానికి ప్రథమ, ప్రధాన పునాది మూడు పార్టీల మధ్య ఉన్న తిరుగులేని ఐక్యత. సార్వత్రిక ఎన్నికల నాటి కలయిక కేవలం ఎన్నికల పొత్తు మాత్రమే కాదని, అది ఒక బలమైన భావజాల బంధమని మరోసారి రుజువైంది. ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి సోషల్ మీడియా వేదికగా విపక్ష శ్రేణులు తీవ్రస్థాయిలో విష ప్రచారం సాగించాయి. జనసేన ఓటర్లు అసంతృప్తితో ఉన్నారని, ఆ ఓట్లు వైసీపీ వైపు మళ్లుతున్నాయంటూ పక్కా ప్లాన్‌తో రెచ్చగొట్టే యత్నాలు జరిగాయి. అయితే, కూటమి అగ్రనేతలు, క్షేత్రస్థాయి కేడర్ ఈ మైండ్ గేమ్‌ను, కుట్రలను ఇట్టే పసిగట్టారు. ఫలితంగా క్షేత్రస్థాయిలో ఓటు బదిలీ ఎలాంటి గందరగోళం లేకుండా నూటికి నూరు శాతం సాఫీగా జరిగిపోయింది. విపక్ష కుతంత్రాలు బెడిసికొట్టి, కూటమి బంధం మరింత పటిష్టమవడానికి ఈ ఎన్నికలు దోహదపడ్డాయి.పాత మూస రాజకీయాలకు స్వస్తి పలుకుతూ అభ్యర్థుల ఎంపికలో కూటమి ప్రదర్శించిన సాహసోపేత నిర్ణయాలు పట్టణ ఓటర్లను విశేషంగా ఆకర్షించాయి. దశాబ్దాలుగా పాతుకుపోయిన వారసత్వ, సంప్రదాయ నేతలకే పరిమితం కాకుండా.. జెన్-జీ తరంతో పాటు సాధారణ మధ్యతరగతి విద్యావంతులైన యువతీయువకులకు భారీగా టిక్కెట్లు కేటాయించారు. కార్పొరేషన్లు, మున్సిపల్ వార్డుల్లో కొత్త ముఖాలు, ప్రజల్లో మంచి గుర్తింపు ఉన్న యువ అభ్యర్థులు బరిలోకి దిగడంతో సహజంగానే పట్టణ ప్రాంతాల్లోని యూత్, విద్యావంతులైన ఓటర్లు కూటమి



అభ్యర్థుల వైపు ఏకపక్షంగా మొగ్గు చూపారు. ఈ వ్యూహాత్మక మార్పు క్లీన్‌స్వీప్‌కు బలమైన చోదకశక్తిగా మారింది.పొత్తుల రాజకీయాల్లో స్థానిక స్థాయిలో సీట్ల సర్దుబాటు ఎప్పుడూ అత్యంత క్లిష్టమైన అంశమే. ఈ ఎన్నికల్లోనూ పలు డివిజన్లు, వార్డుల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల మధ్య ఆశావహుల తీవ్ర పోటీ, అసంతృప్తులు తలెత్తిన మాట వాస్తవమే. అయితే, ఏ ఒక్క నాయకుడూ వ్యక్తిగత విభేదాలతో తమ పార్టీల ఉమ్మడి ప్రయోజనాలకు గండి కొట్టే ప్రయత్నం చేయలేదు. సీనియర్ నాయకత్వం సకాలంలో జోక్యం చేసుకుని సమన్వయ కమిటీల ద్వారా అసమ్మతులను చల్లార్చడం, కేడర్ అంతా కూటమి విజయమే అంతిమ లక్ష్యంగా భావించి సమష్టిగా పనిచేయడం వల్ల ఎక్కడా క్రాస్ ఓటింగ్‌కు ఆస్కారం లేకుండా పోయింది. క్రమశిక్షణతో కూడిన ఈ సమన్వయం కూటమి ఓటు బ్యాంకును ఒక్కతాటిపై నిలిపింది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో శాంతిభద్రతల ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. గత ఐదేళ్ల పాలనలో కనిపించిన అరాచక సంస్కృతి, కక్షసాధింపులు, ఫ్యాక్షన్ భయాలు తొలిగిపోయి.. ప్రజలకు అసలైన మనశ్శాంతి లభించింది. ఎటువంటి రాజకీయ వేధింపులు లేని ప్రశాంత వాతావరణం, సుపరిపాలన ప్రజల్లో నమ్మకాన్ని నింపాయి. దీనికి తోడు రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థల ఆధునీకరణ, అమరావతి రాజధాని పనులు, నగరాల్లో మౌలిక వసతుల కల్పన వంటి అభివృద్ధి కార్యక్రమాలు జోరందుకోవడంతో.. కూటమి పాలనతోనే నగరాలకు భవిష్యత్తు అన్న బలమైన సంకేతం పట్టణ ప్రజల్లోకి బలంగా వెళ్లింది. ఈ ప్రశాంతతకే ఓటర్లు బ్యాలెట్ బాక్సుల ద్వారా జై కొట్టారు.కూటమి బలాలకు తోడుగా.. ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రదర్శించిన నైరాశ్యం, పూర్తి చేతకానితనం కూటమి పనిని మరింత సులువు చేసింది. సార్వత్రిక ఎన్నికల ఓటమి తర్వాత ఆ పార్టీ అగ్ర నాయకత్వం నుంచి క్షేత్రస్థాయి శ్రేణుల వరకు ఆత్మవిశ్వాసం పూర్తిగా అడుగంటింది. అనేక చోట్ల అసలు ఎన్నికల్లో పోటీ చేయడమే గొప్ప అన్నట్లుగా నిస్తేజంగా వ్యవహరించారు. ఎలాగూ ఓడిపోతాం.. పోటీ నామమాత్రంగా చేస్తే చాలు అన్నట్లుగా అభ్యర్థులు చేతులెత్తేయడం, అధిష్టానం నుంచి సరైన ఆర్థిక, సంస్థాగత సహాయం అందకపోవడం వైసీపీ కొంపముంచింది. ప్రజా సమస్యలపై పోరాడే శక్తి లేక, కేవలం సోషల్ మీడియాకే పరిమితమైన వైసీపీ వైఫల్యం.. కూటమికి సంపూర్ణ విజయానికి తివాచీ పరిచింది.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

-మొదటిపేజీ తరువాయి

ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. చెదురుమదురు ఘర్షణలు, వాగ్వాదాలు మినహా చాలా ప్రాంతాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 గంటలకు క్యూలైన్లలో ఉన్న ఓటర్లందరికీ ఓటు వేసే అవకాశం కల్పించారు. దీంతో ఎన్నికల బరిలో నిలిచిన 21,012 మంది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైంది.

2.61 కోట్ల మంది ఓటర్లు

రాష్ట్రవ్యాప్తంగా 582 జడ్పీటీసీ, 7,767 ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. మొత్తం 659 జడ్పీటీసీ స్థానాల్లో 77 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. అలాగే 9,821 ఎంపీటీసీ స్థానాల్లో 2,051 స్థానాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. మిగిలిన స్థానాలకు ఎన్నికలు జరిగాయి. జడ్పీటీసీ స్థానాలకు 2,169 మంది, ఎంపీటీసీ స్థానాలకు 18,843 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. రాష్ట్రంలో మొత్తం 2,61,52,377 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 1.28 కోట్ల మంది పురుషులు, 1.32 కోట్ల మంది మహిళలు, 1,282 మంది ఇతరులు ఉన్నారు.

మూడు గంటల వరకు 58.55 శాతం

మధ్యాహ్నం 3 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా 58.55 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. పోలింగ్ ముగిసే సమయానికి ఈ శాతం 65 నుంచి 68 శాతం మధ్య ఉండవచ్చని ప్రాథమిక అంచనాలు వెలువడ్డాయి. రాయలసీమ, కోస్తాంధ్రలోని పలు జిల్లాల్లో ఓటర్లు ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొన్ని గిరిజన, తీర ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదైనట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా 31,460 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, 8,904 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా, 7,160 కేంద్రాలను అత్యంత సమస్యాత్మకమైనవిగా గుర్తించారు.

పలు చోట్ల ఉద్రిక్తతలు

పల్నాడు, అనంతపురం, చంద్రగిరి, ఎన్టీఆర్ జిల్లాల్లోని కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య వాగ్వాదాలు, తోపులాటలు చోటుచేసుకున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఇరువర్గాల మధ్య ఘర్షణలు జరిగినట్లు సమాచారం. మరికొన్ని చోట్ల కర్రలు, రాళ్లతో దాడులు జరిగినట్లు వార్తలు వచ్చాయి. ఈ ఘటనలతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు బందోబస్తును పటిష్టం చేశారు. పోలింగ్ ప్రక్రియకు పెద్దగా అంతరాయం కలగకుండా అధికారులు చర్యలు చేపట్టారు.

40 వేల మందికి పైగా పోలీసులతో భద్రత

ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా భారీగా సిబ్బందిని నియమించారు. సుమారు 2.52 లక్షల మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు. 40,679 మంది పోలీసులను భద్రతా విధులకు వినియోగించారు. సున్నిత, అత్యంత సున్నిత ప్రాంతాల్లో సీసీటీవీ నిఘా, వెబ్‌కాస్టింగ్, వీడియో చిత్రీకరణ ద్వారా పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులకు సీళ్లు వేసి, పోలీసు భద్రత నడుమ స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు.

రేపు రీపోలింగ్.. 7న కౌంటింగ్

ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, ఏవైనా కేంద్రాల్లో రీపోలింగ్ అవసరమైతే నవంబర్ 6న నిర్వహించనున్నారు. అనంతరం నవంబర్ 7న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. రాష్ట్రవ్యాప్తంగా 365 కేంద్రాల్లో 9,062 కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేశారు. లెక్కింపు ప్రక్రియ కోసం సుమారు 52 వేల మంది సిబ్బందిని వినియోగించనున్నారు. కౌంటింగ్ పూర్తయిన వెంటనే ఫలితాలను ప్రకటించనున్నారు. ఈ ఫలితాల అనంతరం ఎంపీపీ అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌ల ఎన్నికల ప్రక్రియకు అధికారులు ఏర్పాట్లు చేయనున్నారు. దీంతో గ్రామీణ స్థానిక సంస్థల్లో కొత్త పాలకవర్గాల ఏర్పాటు దిశగా తదుపరి ఘట్టం ప్రారంభం కానుంది.

తిరుమల లడ్డూ కేసు..
ఏపీ వెలుపలకు బదిలీకి సుప్రీం నో!

-మొదటిపేజీ తరువాయి

లంకే ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఆయన ఈ కేసులో నిందితుడిగా ఉన్నారు.

పిటిషనర్ వాదనతో విభేదించిన ధర్మాసనం

ఈ పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. రాష్ట్రంలో రాజకీయ నాయకులు ఈ కేసుపై తరచూ ప్రకటనలు చేస్తున్నారని, దీనివల్ల స్వేచ్ఛాయుత విచారణకు ప్రతికూల వాతావరణం ఏర్పడుతోందని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. అందువల్ల ట్రయల్ విచారణను ఏపీ వెలుపల నిర్వహించాలని కోరారు.

సిట్ దర్యాప్తును గుర్తుచేసిన సుప్రీం

పిటిషనర్ వాదనలతో ధర్మాసనం విభేదించింది. సుప్రీంకోర్టు స్వయంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఈ కేసును దర్యాప్తు చేస్తున్న విషయాన్ని గుర్తుచేసింది. ఈ కేసుపై రాజకీయ నాయకులు బహిరంగ వ్యాఖ్యలు చేయవద్దని గతంలోనే ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొంది. అంతేకాకుండా కేసుకు సంబంధించిన చాలామంది సాక్షులు, సాక్ష్యాధారాలు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

బదిలీకి నిరాకరణ.. పిటిషన్ డిస్మిస్

ఈ పరిస్థితుల్లో ట్రయల్ విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. విచారణ బదిలీ విషయంలో తాము జోక్యం చేసుకోబోమని స్పష్టం చేస్తూ మచింద్ర శాంతారామ్ లంకే దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ కేసు విచారణ ఏపీలోనే కొనసాగనుంది.

కొరియాలో ఒడిశా పోలీసుల ఆగడాలు సహించం!



-మొదటిపేజీ తరువాయి

ఆగడాలు మితిమీరిపోయాయని మంత్రి సంధ్యారాణి ఆరోపించారు. గిరిజనులను బెదిరించడం, దాడులకు పాల్పడటం, చివరకు కిడ్నాప్‌లకు కూడా దిగడం దారుణమని విమర్శించారు. ఎన్నికల నిర్వహణపై అభ్యంతరాలు ఉంటే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయాలి తప్ప, అమాయక గిరిజనులను ఇబ్బందులకు గురిచేయడం ఏమిటని ప్రశ్నించారు.

ఓటు హక్కును అడ్డుకునే అధికారం లేదు

గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అడ్డుకునే అధికారం ఎవరికీ లేదని మంత్రి స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్-ఒడిశా సరిహద్దును భారత్-పాకిస్తాన్ సరిహద్దులా మార్చవద్దని హెచ్చరించారు. సరిహద్దు గ్రామాల ప్రజల మధ్య అనవసర ఉద్రిక్తతలు సృష్టించకుండా అధికారులు సంయమనం పాటించాలని సూచించారు.

కొరియాపై సీఎం ప్రత్యేక దృష్టి

కొరియా గ్రామాల సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారని సంధ్యారాణి తెలిపారు. మంత్రి నారా లోకేశ్, హోంమంత్రి వంగలపూడి అనిత కూడా ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారని వెల్లడించారు. గిరిజనుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

సాకే లక్ష్మికి జాతీయ సాహస బాలల పురస్కారం ప్రకటించండి

- రాష్ట్రపతి ముర్ముకు మంత్రి సత్యకుమార్ యాదవ్ లేఖ
- తోటి విద్యార్థిని కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దాడిచేసిన దుండగుడిని ఎదుర్కొన్న లక్ష్మి ధైర్యం అసాధారణం
- ఆపదలో చూపిన తెగువ, మానవత్వం, నిస్వార్థ సేవ దేశంలోని విద్యార్థులందరికీ స్ఫూర్తిదాయకం
- సాకే లక్ష్మి సాహసానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలి

ధర్మవరం, నవంబరు 5 పెన్ సత్తా ::రాప్తాడు ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని గోపికపై జరిగిన దాడి ఘటనలో తన స్నేహితురాలిని కాపాడేందుకు ప్రాణాలకు తెగించి దుండగుడిని ఎదుర్కొన్న మరో విద్యార్థిని సాకే లక్ష్మి అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్యాశాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ అన్నారు. తన ప్రాణాలకు ప్రమాదం ఉందని తెలిసినా వెనుకడుగు వేయకుండా స్నేహితురాలికి రక్షణగా నిలవడం గొప్ప మానవత్వానికి నిదర్శనమని ప్రశంసించారు. ఈ నేపథ్యంలో సాకే లక్ష్మి ప్రదర్శించిన అసాధారణ ధైర్యసాహసాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు కల్పించాలని కోరుతూ నవంబర్ 1వ తేదీన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు మంత్రి సత్యకుమార్ యాదవ్ లేఖ రాశారు. లక్ష్మికి తగిన జాతీయ సాహస బాలల పురస్కారం అందించాలని లేఖలో సిఫార్సు చేశారు. ఆపద

SATYA KUMAR YADAV
Minister for Health, Family Welfare & Medical Education
Government of Andhra Pradesh
AMARAVATI

Room No. 211, 1st Floor, Building No. 5, A.P. Secretariat, Velagapudi, Amaravati - 522 238. Ph. No. 0863-244 5739 e-mail : satyakumar.yadav@ap.gov.nin

Lr No.592 /MINISTER (H,FW&ME)/2026, Dated: 01.11.2026

Respected Madam,

Sub: Andhra Pradesh – Sake Lakshmi, Class X Student, ZPHS Raptadu, Anantapur District – Recommendation for National Bravery Award in recognition of her exceptional courage and selfless intervention – Reg.

*****

On 31 October 2026, a violent attack took place inside a classroom at Zilla Parishad High School, Raptadu, in Anantapur District of Andhra Pradesh, where an assailant armed with a power chainsaw brutally attacked a Class X student, Gopika, during a lesson. Witnessing the assault, Kum. Sake Lakshmi, another student of the same school, courageously intervened amid the panic and confronted the assailant to shield her classmate, placing herself directly in harm's way and sustaining injuries to her legs in the process.

Lakshmi's courageous response in the face of grave danger reflects extraordinary presence of mind, compassion and selflessness. Her willingness to stand up for her classmate, without regard for her own safety, exemplifies the highest values of humanity and moral courage.

Kum. Sake Lakshmi hails from Ayyavaripalli village in Raptadu Mandal, Anantapur District, Andhra Pradesh. Coming from an economically disadvantaged family and pursuing her education in a Government school, she has shown that courage and compassion are determined not by one's circumstances, but by the strength of one's character.

The exceptional bravery displayed by this young student from Andhra Pradesh deserves recognition at the national level. I therefore strongly recommend Kum. Sake Lakshmi for an appropriate National Bravery Award in recognition of her selfless intervention and remarkable courage. Such recognition would honour her exemplary conduct and inspire students across Andhra Pradesh and the country to uphold compassion, courage and responsibility, and to stand firmly for the safety and dignity of others.

With profound regards,

Yours sincerely,

(SATYA KUMAR YADAV)

The Hon'ble President of India,
Rashtrapati Bhavan,
New Delhi – 110004.



సమయంలో తన భద్రతను సైతం లెక్కచేయకుండా తోటి విద్యార్థిని ప్రాణాలను కాపాడేందుకు లక్ష్మి చేసిన ప్రయత్నం అభినందనీయమని, ఆమె ధైర్యం, సమయస్ఫూర్తి, నిస్వార్థ సేవ దేశంలోని విద్యార్థులందరికీ స్ఫూర్తిదాయకమని మంత్రి పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబానికి చెందిన లక్ష్మి తన సాహసంతో మానవత్వం, ధైర్యం, బాధ్యత వంటి గొప్ప విలువలను చాటిచెప్పిందని తెలిపారు.

నగర అభివృద్ధి కోసం పాటుపడతా

- ఎన్నో ఇబ్బందులు పెట్టారు.. అయినా నిలబడ్డాం..
- అనంత నగర ప్రజలకు రుణపడి ఉంటా..
- నగర మేయర్ రమేష్ గౌడ్
- మా కల.. మా లక్ష్యం నెరవేరింది
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్



అనంతపురం,నవంబరు 5 పెన్ సత్తా ::అనంతపురం నగర అభివృద్ధికి పాటుపడ తానని, కులమతాలను అన్ని కలుపుకుని అభివృద్ధి కోసం ముందుకు సాగుతామని అనంతపురం నగరపాలక సంస్థ మేయర్ రమేష్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం సీపీఐ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి అయిన తనను అత్యధిక మెజార్టీతో గెలిపించినందుకు నగర ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వం ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా.. భయపడకుండా ఎదురు నిలబడి ఈరోజు మేయర్ గా నిలవడం జరిగిందన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సీపీఐ నాయకులు అందరూ నా గెలుపుకి కృషి చేశారని, అందుకు వారికి తాను రుణపడి ఉంటానని తెలిపారు. అన్ని మతాలు, కులాలను ఏకం చేస్తూ అన్నదమ్ముల మాదిరిగా కలిసిమెలిసి ఉంటూ అనంతపురం నగరాన్ని అభివృద్ధి చేసుకుందామని తెలియజేశారు.అనంతపురం నగర స్థానిక సంస్థల ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రమేష్ గౌడ్ ను మేయర్ గా అత్యధిక మెజార్టీతో గెలిపించినందుకు అనంతపురం నగర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడు తూఅనంతపురం నగరంలో బీజేపీ అభ్యర్థి అజేష్ బాబు రాకూడదు అనే లక్ష్యంతోనే సీపీఐ నాయకులు అంతా కృషి చేశారన్నారు. బీజేపీ వ్యక్తులకు తాము వ్యతిరేకం కాదని.. బీజేపీ సిద్ధాంతాలకు వ్యతిరేకమని అందుకే బీజేపీ అభ్యర్థిని మేయర్ అభ్యర్థిగా ఓడించడం జరిగిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ వైసీపీ మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్ కు ఓటు వేస్తే అనంతపురం నగరం అభివృద్ధి చెందదు అంటూ బెదిరింపు ధోరణి సరికాదన్నారు. నగర అభివృద్ధికి సీపీఐ పార్టీ తరపున తాము రమేష్ గౌడ్ కు అండగా ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, జాఫర్, సహాయ కార్యదర్శి రాజారెడ్డి, నగర కార్యదర్శి శ్రీరాములు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాజేష్ గౌడ్, నగర సహాయ కార్యదర్శి కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సరళిని పరిశీలించిన ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు



అమరాపురం,నవంబరు 5 పెన్ సత్తా :మండల పరిధిలోని బసవనపల్లి, ఆలద పల్లి, హలుకురు, అమర పురం మరియు హేమావతి ప్రస్తుతం జరుగుతున్నటువంటి స్థానిక సంస్థల జడ్పిటిసి ఎంపిటిసి పోలింగ్ సరళీణి పరిచయలను చేపట్టారు. ఈ సందర్భంగా ప్రస్తుతం జరుగుతున్నటువంటి ఎలక్షన్ వివిధ విధానాలు గురించి స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా జరగడానికి అందరూ సహకరించాలన్నారు. ప్రజలకు వారి ఓటు హక్కును వినియోగించుకోవడానికి అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి అభ్యర్థులు రాఘవేంద్ర,ఎం నాగరాజు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షురాలు కేఎన్ఎం రత్నమ్మ నరసింహామూర్తి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మారుతి ప్రసాద్, నాయకులు కే ఎల్ ఎం శివకుమార్ యాదవ్, దాదు, నాయకులు కార్యకర్తలు సమావేశంలో పాల్గొన్నారు.

జేఎన్టీయూలో స్ట్రాంగ్ రూంలను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్



అనంతపురం, నవంబరు 5 పెన్ సత్తా :అనంతపురం నగరంలోని జేఎన్టీయూఏలో ఉన్న స్ట్రాంగ్ రూంలను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ పరిశీలించారు. జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు – 2026లో భాగంగా గురువారం పోలింగ్ ప్రక్రియ నిర్వహించగా, అనంతరం పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్స్ లను నగరంలోని జేఎన్టీయూఏలో ఉన్న స్ట్రాంగ్ రూంలకు తరలించగా, జాయింట్ కలెక్టర్ పరిశీలించడం జరిగింది. ఇప్పటివరకు ఎన్ని బ్యాలెంట్ బాక్సులు స్ట్రాంగ్ లకు చేరుకున్నాయి, ఇంకా ఎన్ని రావాల్సి ఉంది, స్ట్రాంగ్ రూమ్ ల వద్ద తీసుకున్న చర్యల గురించి జాయింట్ కలెక్టర్ అడిగి తెలుసు కున్నారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ప్రేమంత కుమార్, అధికారులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో జర్నలిస్టులపై పోలీసుల దౌర్జన్యం దారుణం





- వీకోట, నల్లమాడ, చిలమత్తూరులో పోలీసుల తీరుపై ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆగ్రహం
- జర్నలిస్టుల పట్ల సీఐలు, డీఎస్పీ దురుసు ప్రవర్తనను ఖండించిన ఫెడరేషన్
- బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్
- చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరిక

హిందూపురం, నవంబరు 5 పెన్ సత్తా :ఎన్నికల విధుల్లో ఉన్న పోలీసులు జర్నలిస్టులపై దాడులకు యత్నించడం, దురుసుగా ప్రవర్తించడం ప్రజాస్వామ్య వ్యవస్థకే గొడ్డలిపెట్టువంటిదని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) శ్రీ సత్యసాయి జిల్లా శాఖ అధ్యక్షుడు శివరామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి షబ్బీర్ తీవ్రంగా ఖండించారు. చిత్తూరు జిల్లా వీకోటలో ఎన్టీవీ రిపోర్టర్ అక్రమ్‌పై, శ్రీ సత్యసాయి జిల్లా నల్లమాడలో ఫెడరేషన్ జిల్లా కోశాధికారి, సీనియర్ జర్నలిస్టు బాబ్జాన్‌పై, చిలమత్తూరులో సాక్షి రిపోర్టర్‌పై పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టుల పట్ల దురుసుగా ప్రవర్తించిన సంబంధిత పోలీసు అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిత్తూరు జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల వార్తల సేకరణకు వెళ్లిన వీకోట ఎన్టీవీ రిపోర్టర్ అక్రమ్‌పై సీఐ స్థాయి అధికారి దాడికి యత్నించడం పోలీసుల అధికార దుర్వినియోగానికి నిదర్శనమన్నారు. ఓటు వేసేందుకు వెళుతున్నామని చెప్పినా వినకుండా జర్నలిస్టుపై దాడికి ప్రయత్నించడం ఏమిటని ప్రశ్నించారు. అదేవిధంగా శ్రీ సత్యసాయి జిల్లా నల్లమాడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాల వద్ద చోటుచేసుకుంటున్న స్వల్ప ఘటనలను చిత్రీకరిస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కోశాధికారి, సీనియర్ జర్నలిస్టు బాబ్జాన్ పట్ల స్థానిక సీఐ దురుసుగా ప్రవర్తించడం గర్హనీయమన్నారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లతో మాట్లాడకుండా, లోపలికి వెళ్లకుండా బయట నుంచే ఘటనలను చిత్రీకరిస్తున్న బాబ్జాన్‌ను సీఐ మొదట బయటకు వెళ్లాలని దబాయించి నెట్టివేశారని తెలిపారు. తాను చిత్రీకరణ పూర్తి చేసుకొని వెళ్లిపోతానని చెప్పినా వినకుండా దౌర్జన్యానికి దిగారని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రంలో అనవసరంగా ఉన్న వారిని కూడా బయటకు పంపించాలని బాబ్జాన్ సూచించగా, కేవలం తననే బయటకు వెళ్లమని ఎందుకు ఒత్తిడి చేస్తున్నారని సీఐని ప్రశ్నించడంతో ఆయన కొట్టడానికి వచ్చినట్లు, బయటకు వెళ్లకపోతే అంతు చూస్తానని బెదిరించినట్లు వివరించారు. తన వద్ద ఉన్న అక్రిడిటేషన్ కార్డుతో పాటు ఇతర గుర్తింపు కార్డులను చూపించినప్పటికీ వాటిని లాక్కొని బెదిరింపులకు దిగారని, చివరకు కార్డును జేబులో పెట్టి పక్కకు తోసేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా చిలమత్తూరు మండల కేంద్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు స్టేషన్‌లో నిర్బంధించారన్న విషయం తెలుసుకున్న సాక్షి రిపోర్టర్ వార్తా సేకరణలో భాగంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లారని తెలిపారు. ఈ సందర్భంగా అక్కడ విధుల్లో ఉన్న డీఎస్పీ సదరు విలేకరితో నిర్లక్ష్యంగా మాట్లాడటంతో పాటు, తన వృత్తిపరమైన బాధ్యతను నిర్వర్తించేందుకు స్టేషన్‌కు వెళ్లిన జర్నలిస్టుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజలకు సమాచారాన్ని అందించాల్సిన బాధ్యతలో భాగంగా విలేకరులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లడాన్ని తప్పుగా చూడటం, వారిని భయభ్రాంతులకు గురిచేసేలా మాట్లాడటం అధికారుల వైఖరికి అద్దం పడుతోందన్నారు. జర్నలిస్టులతో గౌరవప్రదంగా వ్యవహరించాల్సిన బాధ్యత పోలీసు అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద ఘటనలు జరుగుతున్నప్పటికీ వాటిని అదుపు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు, తమ విధి నిర్వహణలో భాగంగా వాటిని చిత్రీకరిస్తున్న జర్నలిస్టులపై మాత్రం ఆగ్రహం వ్యక్తం చేయడం విచారకరమన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్తంభంగా ఉన్న మీడియాకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే జర్నలిస్టుల విధులకు ఆటంకం కలిగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ప్రజా సమస్యలు, ఎన్నికల పరిణామాలు, రాజకీయ ఘటనలను వెలుగులోకి తీసుకురావడం జర్నలిస్టుల బాధ్యత అని, ఆ వృత్తిపరమైన హక్కులను అడ్డుకునే అధికారం ఎవరికీ లేదని పేర్కొన్నారు. ఈ మూడు ఘటనలను పోలీసు ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించి తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడులకు యత్నించిన, దురుసుగా ప్రవర్తించిన సంబంధిత సీఐలు, డీఎస్పీపై తగిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. జర్నలిస్టులపై దౌర్జన్యాలకు పాల్పడే అధికారుల విషయంలో ఫెడరేషన్ ఉపేక్షించబోదని హెచ్చరించారు. ఈ ఘటనలపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోని పక్షంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని జిల్లా అధ్యక్షుడు శివరామకృష్ణ, ప్రధాన కార్యదర్శి షబ్బీర్ స్పష్టం చేశారు.

స్ఫటిక లింగ ప్రాణప్రతిష్ఠ అనంతరం భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయం

యాడికి, నవంబరు 5 పెన్ సత్తా :యాడికి హాస్పిటల్ కాలనీ హై స్కూల్ గ్రౌండ్ వెనకాల నాగుల కట్ట వీధిలో శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున ఉత్సవ విగ్రహాలు సమేతంగా స్ఫటిక లింగ ప్రాణప్రతిష్ట కార్యక్రమం అంగరంగ వైభవంగా జరగడంతో ప్రతిరోజు స్వామి వారికి బిల్వ పత్రి రుద్రాభిషేకం నెయ్యి అభిషేకం పంచామృతాభిషేకం అలాగే ధూప దీప నైవేద్యాలతో స్వామివారిని అలకన చేయడంతో భక్తులు దర్శించడం జరిగింది ఈ కార్యక్రమాలని ఎంతో ఘనంగా ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి కృప కటాక్షాలకు పాత్రులు అయి తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు



యాడికి మండలంలో 67.79 శాతం పోలింగ్ నమోదు



యాడికి, నవంబరు 5 పెన్ సత్తా :యాడికి మండల వ్యాప్తంగా జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.గురువారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా, ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. యాడికి మండలంలో 16 ఎంపీటీసీ స్థానాలకు గాను 4 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 12 ఎంపీటీసీ స్థానాలు , జడ్పిటిసి స్థానానికి అభ్యర్థులు పోటీ చేశారు. యాడికి మండలంలో ఎన్నికల నిర్వహణకు ఎన్నికల అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. యాడికి మండలంలో 67.79 శాతం ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఎన్నికల అధికారులు షమీం భాషా వీర రాజు తెలిపారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సిఐ శ్రీనివాసులు పోలీసు సిబ్బంది తో గట్టి బందోబస్తు నిర్వహించారు.ఈ నెల 7వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడించనున్నారు.

ఆనందపురం జంక్షన్‌లో ట్రాఫిక్ అస్తవ్యస్తం.. ప్రయాణికుల అవస్థలు!

- ఎన్నికల రద్దీపై ముందస్తు చర్యలు ఏవీ?
- కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు.. గంటల తరబడి ప్రయాణికుల పడిగాపులు!
- భోగాపురం విమానాశ్రయానికి వెళ్లేవారికీ తప్పని ట్రాఫిక్ కష్టాలు!
- ట్రాఫిక్ నియంత్రణలో పోలీసుల ఏర్పాట్లపై ప్రయాణికుల అసంతృప్తి!



ఆనందపురం, నవంబరు 5 పెన్ సత్తా :ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో స్వగ్రామాలకు తరలిరావడంతో ఆనందపురం జంక్షన్ వద్ద తీవ్ర ట్రాఫిక్ రద్దీ నెలకొంది. ఆనందపురం జంక్షన్ నుంచి భీమిలి క్రాస్ రోడ్డు వరకు వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు గంటల తరబడి రహదారిపైనే వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఎన్నికల రోజున భారీగా వాహనాల రాకపోకలు ఉంటాయని ముందుగానే తెలిసినా ట్రాఫిక్ నియంత్రణకు తగిన ఏర్పాట్లు చేయలేదని వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచే పెరిగిన రద్దీ మధ్యాహ్నానికి మరింత తీవ్రమై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

భోగాపురం విమానాశ్రయ ప్రయాణికుల ఇక్కట్లు

ఈ ట్రాఫిక్ రద్దీ కారణంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులు సైతం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విమాన సమయానికి చేరుకుంటామో లేదోనని ఆందోళన చెందారు. చిన్నారులు, వృద్ధులు ఎండలో తీవ్ర అవస్థలు పడ్డారు.

ట్రాఫిక్ నియంత్రణపై ప్రశ్నలు!

ఇంతటి రద్దీ ఏర్పడినప్పటికీ ట్రాఫిక్ నియంత్రణకు తగిన స్థాయిలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలు, వాహనాల మళ్లింపు, అదనపు సిబ్బంది ఏర్పాటు వంటి ముందస్తు చర్యలు ఎందుకు చేపట్టలేదని నిలదీస్తున్నారు.

ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రయాణించే సమయంలో ఇలాంటి ఇబ్బందులు ఎదురుకావడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆనందపురం జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పోలింగ్ సరళి పరిశీలించిన గంటా






విశాఖపట్నం,నవంబరు 5 పెన్ సత్తా : భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ సరళిని గురువారం పరిశీలించారు. ఆనందపురం మండలంలో ఆనందపురం, బోని, పద్మనాభం మండలంలోని కృష్ణాపురం, భీమిలి మండలంలోని లక్ష్మీపురం పోలింగ్ స్టేషన్ల వద్ద పరిస్థితిని సమీక్షించారు. ఓటింగ్ తీరుతెన్నుల గురించి కూటమి నాయకులతో మాట్లాడారు. వైసీపీ నాయకులు కొన్ని చోట్ల గందరగోళం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని చెబుతూ అధికారుల సహకారం తీసుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని సూచించారు. ఇటీవలి మున్సిపల్ ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేట్ తో సాధించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని అంతకు మించిన గెలుపు ఫలితాలు నమోదు చేయాలన్నారు. ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవడానికి పెద్దఎత్తున పోలింగ్ కేంద్రాలకు వస్తున్నారని కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గాదు వెంకటప్పుడు, డి.ఎ.ఎన్. రాజు, తాట్రాజు అప్పారావు, మీసాల సత్యనారాయణ, సూరాల సత్య వరప్రసాద్, కె. రామరాజు తదితరులు గంటాకు వివరించారు.

వృద్ధురాలికి వీల్‌చైర్‌పై స్వయంగా సహాయం.. ఆనందపురం సీఐ మానవత్వానికి ప్రశంసలు!





ఆనందపురం , నవంబరు 5 పెన్ సత్తా :ఎన్నికల విధుల్లోనూ మానవత్వాన్ని చాటుకున్నారు ఆనందపురం పోలీస్ స్టేషన్ సీఐ వీవీసీఎం ఎర్రం నాయుడు. నడవలేని స్థితిలో ఉన్న ఓ వృద్ధురాలిని గమనించిన ఆయన, వెంటనే స్పందించి స్వయంగా వీల్‌చైర్‌పై కూర్చోబెట్టి పోలింగ్ కేంద్రం వరకు తీసుకెళ్లి ఓటు హక్కు వినియోగించుకునేందుకు సహకరించారు.

ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నప్పటికీ వృద్ధురాలి ఇబ్బందిని గుర్తించి, అధికార హోదాను పక్కనపెట్టి ఆప్యాయంగా సహాయం అందించడం పలువురి దృష్టిని ఆకర్షించింది. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉందని, వయస్సు, శారీరక ఇబ్బందులు ఆ హక్కుకు అడ్డంకి కాకూడదనే విషయాన్ని తన చర్యతో చాటిచెప్పారు.

పోలీసుల బాధ్యత కేవలం శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కాదని, అవసరమైన సమయంలో ప్రజలకు అండగా నిలవడం కూడా తమ విధిలో భాగమని ఈ ఘటన మరోసారి గుర్తుచేసింది.

వృద్ధురాలికి సహాయం అందించిన సీఐ ఎర్రం నాయుడు సేవాభావంపై స్థానికులు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు.ఓటు హక్కుకు తోడుగా పోలీసు చేయూత.. విధి నిర్వహణలో మానవత్వం చాటిన ఆనందపురం సీఐ!

ప్రశాంతంగా ముగిసిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు.. పద్మనాభంలో 81 శాతానికి పైగా పోలింగ్ నమోదు!





- కోరాడలో అత్యధికంగా 89 శాతం.. రెడ్డిపల్లిలో అత్యల్పంగా 74 శాతం పోలింగ్
- పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య ముగిసిన పోలింగ్ ప్రక్రియ
- ఫలితాల కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్న అభ్యర్థులు

పద్మనాభం, నవంబరు 5 పెన్ సత్తా :పద్మనాభం మండలంలో గురువారం నిర్వహించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగిన పోలింగ్‌లో మండలవ్యాప్తంగా 81 శాతానికి పైగా ఓటింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.మండలంలోని 15 ఎంపీటీసీ స్థానాలు, ఒక జెడ్పీటీసీ స్థానానికి ఎన్నికలు నిర్వహించగా, కోరాడ పంచాయతీలో అత్యధికంగా 89 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. రెడ్డిపల్లిలో అత్యల్పంగా 74 శాతానికి పైగా ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.వేకువజాము నుంచే అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మాక్ పోలింగ్ అనంతరం ఉదయం 7 గంటలకు ఓటింగ్ ప్రారంభమైంది. మధ్యాహ్నం 12 గంటలకే పలు ప్రాంతాల్లో 50 శాతానికి పైగా ఓటింగ్ నమోదు కావడం విశేషం. పోలీసుల పటిష్ట బందోబస్తు, అధికారుల సమన్వయంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలింగ్ ప్రక్రియ పూర్తయింది.జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మండలంలోని ఎన్నికల కేంద్రాల వద్ద పోలింగ్ సరళిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు సజావుగా జరిగేలా భద్రతా చర్యలు మరింత పటిష్టంగా అమలు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు.ఇదిలా ఉండగా, ఈసారి ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్‌సీపీ గట్టి పోటీ ఇవ్వడంతో ఎన్నికల ఫలితాలపై మండలవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. శనివారం ఓట్ల లెక్కింపు జరగనుండటంతో అభ్యర్థులు, వారి అనుచరులు ఫలితాల కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. కేవలం ఒక్కరోజు వ్యవధిలోనే ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో రాజకీయ వర్గాల్లో చర్చలు జోరందుకున్నాయి.గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి కూడా పద్మనాభం మండలంలో ప్రశాంతంగా పోలింగ్ జరగడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

గంటాను కలిసిన మేయర్ శ్రావణి





విశాఖపట్నం, నవంబరు 5 పెన్ సత్తా : భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును జీవీఎంసీ మేయర్ గా ఎన్నికైన ముక్కా శ్రావణి ఎంవీపీ కాలనీ క్యాంప్ ఆఫీస్ లో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎం చంద్రబాబు విజన్ కు పెద్దపీట వేసేలా విశాఖను విశ్వ నగరంగా అభివృద్ధి చేయాలని ఆమెకు గంటా సూచించారు. ఐటీ, టూరిజం, రియల్ ఎస్టేట్ రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో అంతర్జాతీయ స్థాయి మౌలిక సౌకర్యాలు కల్పించడానికి కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా విశాఖను అన్ని రంగాల్లో నెంబర్ వన్ గా నిలబెట్టాలని చెప్పారు. గంటా దంపతులు ఆమెను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

నా గెలుపు సెంటిమెంట్ గంటా: శ్రావణి

ఉత్తరం ఎమ్మెల్యేగా ఉన్న గంటా శ్రీనివాసరావు 2021 లో తన మీద నమ్మకంతో టికెట్ ఇవ్వగా కార్పొరేటర్ గా విజయం సాధించానని ముక్కా శ్రావణి ఈ సందర్భంగా చెప్పారు. గంటా తన గెలుపు సెంటిమెంట్ కావడం వల్లే ఆయన ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న భీమిలి నుంచే మేయర్ అభ్యర్థిగా ప్రచారాన్ని ప్రారంభించానని వెల్లడించారు. 2000 ఎన్నికల్లో పొత్తులో బీజేపీకి వెళ్లాల్సిన కార్పొరేటర్ టికెట్ ను తన తండ్రి ముక్కా ముత్యాల నాయుడు కోసం టీడీపీకి వచ్చేట్టు గంటా చేశారని గుర్తు చేసుకున్నారు. మేయర్ గా గెలిచిన తర్వాత ఆయన ఆశీస్సులు తీసుకోవడానికి వచ్చానన్నారు.

క్రికెట్ అభిమానులకు శుభవార్త.. వైజాగ్‌కు భారత్--శ్రీలంక తొలి వన్డే మ్యాచ్!



విశాఖపట్నం నవంబరు 5 పెన్ సత్తా :ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అభిమానులకు శుభవార్త. భారత్--శ్రీలంక జట్ల మధ్య జరగనున్న తొలి వన్డే అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ వేదిక మారింది. తొలుత డిసెంబర్ 13న ఢిల్లీలో నిర్వహించాల్సిన ఈ మ్యాచ్‌ను విశాఖపట్నంలోని మధురవాడ ఏసీఏ--వీడీసీఏ క్రికెట్ మైదానానికి మార్చినట్లు బీసీసీఐ ప్రకటించినట్లు సమాచారం.

వేదిక మార్పునకు కారణాలు

ఢిల్లీలోని అరుణ్ జైట్లీ క్రికెట్ మైదానంలో కొనసాగుతున్న పునరుద్ధరణ, మరమ్మతు పనులతో పాటు నగరంలో నెలకొన్న వాయు కాలుష్య పరిస్థితుల నేపథ్యంలో మ్యాచ్ నిర్వహణకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ఢిల్లీ క్రికెట్ సంఘం బీసీసీఐకి విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది. ఈ విజ్ఞప్తిని పరిశీలించిన బీసీసీఐ తొలి వన్డే వేదికను విశాఖపట్నానికి మార్చినట్లు పేర్కొంది.

మ్యాచ్‌ల వివరాలు

- తొలి వన్డే: డిసెంబర్ 13 -- విశాఖపట్నం.
- రెండో వన్డే: డిసెంబర్ 16.
- మూడో వన్డే: డిసెంబర్ 19.
- తొలి టీ20: డిసెంబర్ 22.
- రెండో టీ20: డిసెంబర్ 24.
- మూడో టీ20: డిసెంబర్ 27.

తొలి వన్డే మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కానున్నట్లు సమాచారం. వేదిక మార్పు మినహా మ్యాచ్‌ల తేదీల్లో ఎలాంటి మార్పు లేదని పేర్కొన్నారు.శాఖలో అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ జరగనుండటంతో స్థానిక క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. మరోసారి మధురవాడ క్రికెట్ మైదానం అంతర్జాతీయ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది.

సున్నితమైన పోలింగ్ కేంద్రాల్లో పోలీస్ కమిషనర్ విస్తృత తనిఖీలు.. పటిష్ట భద్రతకు ఆదేశాలు



పద్మనాభం, నవంబరు 5 పెన్ సత్తా :స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పద్మనాభం మండలంలోని సున్నితమైన పోలింగ్ కేంద్రాలను విశాఖ నగర పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి విస్తృతంగా పరిశీలించారు.మండలంలోని శేరిఖండం, రెడ్డిపల్లి, పోతనూరు, గంధవరం, అనంతవరం, పాత కోవ్వాడ, కొత్త కోవ్వాడ, పెంట తదితర గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ఎన్నికల భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.ఈ సందర్భంగా సున్నితమైన పోలింగ్ కేంద్రాల వద్ద చేపట్టిన భద్రతా చర్యలను పరిశీలించి, సమర్థవంతమైన పోలీసు బందోబస్తు నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.సమస్యాత్మక ప్రాంతాలపై నిరంతరం నిఘా ఉంచాలని, పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు స్పష్టం చేశారు.



వ్యక్తి వెనుకే నడిచిన ఓటు
భారీగా గెలిచిన స్వతంత్రులు, రెబల్స్

విజయవాడ, నవంబర్ 5, :
ఏపీ మున్సిపల్ ఎన్నికల్లో కూటమి హవా కనిపించింది. కానీ అదే సమయంలో రెబల్స్ కూడా పార్టీలకు షాక్ ఇచ్చారు. టికెట్ రాలేదని వెనక్కి తగ్గలేదు. పార్టీ గుర్తు లేకుండానే స్వతంత్రులుగా పోటీ చేశారు. కొన్ని చోట్ల వార్డులు గెలిచారు. మరికొన్ని చోట్ల ఏకంగా చైర్‌పర్సన్ పీఠాలనే దక్కించుకున్నారు. విశాఖ నుంచి పిఠాపురం వరకు.. నెల్లిమర్ల నుంచి సాలూరు వరకు తమ సత్తా చూపించారు. కూటమి గెలుపు మధ్య రెబల్స్ విజయాలు ఇప్పుడు పార్టీల్లో చర్చగా మారాయి.విశాఖ ఎన్నికల్లో సుమారు 40 మంది రెబల్స్ స్వతంత్రులుగా పోటీ చేశారు. వీరిలో ఎనిమిది మంది గెలిచారు. 36, 39, 41, 73, 86, 98, 106, 118 వార్డులను స్వతంత్రులు కైవసం చేసుకున్నారు. వీరిలో కొందరు టీడీపీ, జనసేన టికెట్లు ఆశించి భంగపడిన నేతలే. కొన్ని చోట్ల ఒకే కూటమి నుంచి ఇద్దరు, ముగ్గురు రెబల్స్ పోటీకి దిగారు. దీంతో అధికారిక అభ్యర్థుల ఓట్లు చీలిందనే చర్చ జరిగింది. విశాఖలో కూటమి 120 వార్డులకు గాను 98 గెలిచినా.. రెబల్స్ గెలుపు మాత్రం నాయకులకు కొత్త తలనొప్పిగా మారింది.పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలోనూ ఇదే జరిగింది. అక్కడ చైర్‌పర్సన్ పీఠం జనసేనకు దక్కింది. కానీ పలు వార్డుల్లో స్వతంత్రులు గెలిచారు. పది మంది స్వతంత్రులు గెలిచారు. జనసేన, టీడీపీ, వైసీపీల్లో టికెట్ రాని అసంతృప్త నేతలు స్వతంత్రులుగా బరిలోకి దిగారు. అంటే పార్టీకి ఓటేస్తూనే.. తమకు నచ్చిన స్థానిక నాయకుడిని కూడా గెలిపించారన్న మాట.

నెల్లిమర్ల, సాలూరులో పీఠాలే సొంతం
రెబల్స్ ప్రభావం వార్డులకే పరిమితం కాలేదు. నెల్లిమర్లలో టీడీపీ టికెట్ ఆశించి భంగపడిన లంక అప్పలనాయుడు స్వతంత్రంగా పోటీ చేసి చైర్‌పర్సన్‌గా గెలిచారు. సాలూరులోటీడీపీ రెబల్ జి. అరుణ కూడా స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు. కర్నూలు జిల్లా ఆదోనిలో జనసేన రెబల్ అధికారిక బీజేపీ అభ్యర్థిపై గెలిచారు. టికెట్ లేకపోయినా.. తమకున్న స్థానిక బలంతో ఈ నేతలు గెలవడం పార్టీలకు గట్టి సందేశమే.


రెబల్స్ వెనుక ఉన్న బలమేంటి
ఈ గెలుపుల వెనుక స్థానిక పరిచయాలు, ప్రజల్లో ఉన్న పేరు ప్రధానంగా కనిపిస్తున్నాయి. కొందరు ఏళ్లుగా ప్రజలకు అందుబాటులో ఉన్నారు. స్థానిక సమస్యలపై పనిచేశారు. మరికొందరికి బలమైన అనుచరగణం ఉంది. టికెట్ రాకపోవడంతో అదే బలాన్ని నమ్ముకుని స్వతంత్రులుగా పోటీ చేశారు. కొన్ని చోట్ల కులం, కుటుంబం, వ్యాపార వర్గాల మద్దతు కూడా కలిసొచ్చి ఉండొచ్చు. పార్టీ గుర్తు కంటే అభ్యర్థి ఎవరు అన్నదానికే ఓటర్లు ప్రాధాన్యం ఇచ్చినట్లు కనిపిస్తోంది. రాజకీయాల్లో ఓ మాట ఉంది. పార్టీ జెండా నీడనిస్తుంది. కానీ ఓటు మాత్రం వ్యక్తి వెంట నడుస్తుంది. ఈ ఎన్నికల్లో కొన్ని చోట్ల అదే జరిగింది. పార్టీలు తమకు నచ్చిన వారికి టికెట్లు ఇచ్చాయి. ఓటర్లు మాత్రం తమకు నచ్చిన వారిని గెలిపించారు. పాత నేతలను పక్కనపెట్టారా, కొత్తవారికి అవకాశం ఇచ్చారా, కుటుంబ సభ్యులకు టికెట్లు ఇచ్చారా అన్న చర్చ కూడా మొదలైంది.

కుటుంబాలు, వర్గాల మధ్య పోరు
కొన్ని చోట్ల టికెట్ల కేటాయింపుపై కుటుంబాలు, వర్గాల మధ్య అసంతృప్తి ఉందనే చర్చ జరుగుతోంది. ఏళ్లుగా పార్టీ కోసం పనిచేసిన వారిని పక్కనపెట్టడం, స్థానికంగా బలమున్న వారికి టికెట్ ఇవ్వకపోవడం తిరుగుబాట్లకు కారణమై ఉండొచ్చు. కుటుంబాల మధ్య ఆధిపత్య పోరు కూడా కొన్ని చోట్ల ప్రభావం చూపి ఉండొచ్చు. అయితే ప్రతి రెబల్ గెలుపునకు ఇదే కారణమని చెప్పలేం. ఒక్కో చోట పరిస్థితి ఒక్కోలా ఉంటుంది.

ఇప్పుడు రెబల్స్ కింగ్‌మేకర్లా
గెలిచిన స్వతంత్రుల పాత్ర ఇప్పుడు కీలకం కానుంది. వీరు అధికార పార్టీలతో కలుస్తారా, స్వతంత్రంగానే ఉంటారా, మళ్లీ పాత పార్టీల్లో చేరతారా అన్నది ఆసక్తికరంగా మారింది. పార్టీ అండ లేకుండా గెలిచిన వీరికి అభివృద్ధి పనులు చేయించుకోవడం కూడా సవాలే. గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే ఇప్పుడు అసలైన పరీక్ష.
పార్టీలకు గుణపాఠంఈ ఫలితాలు పార్టీ పెద్దలకు ఓ పాఠం చెబుతున్నాయి. టికెట్లు ఇచ్చేటప్పుడు నాయకుల సిఫార్సులు, పొత్తుల లెక్కలే కాదు. స్థానికంగా ఎవరికి ప్రజాబలం ఉందో కూడా చూడాలి. ప్రజల్లో పట్టున్న నేతలను పక్కనపెడితే.. వాళ్లే స్వతంత్రులుగా మారి పార్టీ అభ్యర్థులకు పోటీ ఇస్తారు. ఈ పరిణామాలు వచ్చే ఎన్నికల్లో టికెట్ల కేటాయింపుపై ప్రభావం చూపొచ్చు. వార్డుల్లో గెలిచిన నేతలు రేపు పెద్ద రాజకీయాల్లోకి రావాలని కూడా అనుకోవచ్చు.మొత్తానికి ఏపీ పురపోరులో కూటమి ఆధిపత్యం ఒకవైపు ఉంటే, రెబల్స్ విజయాలు మరోవైపు పార్టీలకు గట్టి సందేశం ఇచ్చాయి. విశాఖలో వార్డులు, పిఠాపురంలో స్థానాలు, నెల్లిమర్ల, సాలూరులో చైర్‌పర్సన్ పీఠాలు.. ఇలా తమ బలాన్ని చూపించారు. పార్టీలు టికెట్లు పంచాయి. ఓటర్లు మాత్రం తమ తీర్పు చెప్పారు. జెండా లేకపోయినా జనబలం ఉంటే గెలవొచ్చని రెబల్స్ నిరూపించారు. వీరి తిరుగుబాటు రాబోయే రోజుల్లో పార్టీల్లో ఇంకెన్ని మార్పులు తెస్తుందో చూడాలి.

అనంతలో తేడా ఎక్కడ కొట్టింది.. బాబు ఆరా.. !

టీడీపీకి కంచుకోటగా భావించే అనంతపురం కార్పొరేషన్‌లో వైసీపీ విజయం సాధించడంపై సీఎం చంద్రబాబు ఆరా తీసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలోని 13 కార్పొరేషన్లలో 12 చోట్ల కూటమి గెలవగా, అనంతపురంలో వైసీపీ అభ్యర్థి రమేష్ గౌడ్ మేయర్ పీఠం దక్కించుకోనున్నారు. బీజేపీకి కేటాయించిన ఈ స్థానంలో ఓటమికి కారణాలపై చంద్రబాబు నేతల నుంచి నివేదిక కోరినట్లు సమాచారం.
టీడీపీకి కంచుకోట వంటి అనంతపురంలో వైసీపీ విజయం దక్కించుకోవడం వింతగా ఉంది. నిజానికి రాష్ట్ర వ్యాప్తంగా 13 కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగితే.. 12 చోట్ల కూటమి పార్టీలు విజయం దక్కించుకున్నారు. ముఖ్యంగా టీడీపీ, జనసేన పోటీ చేసిన కార్పొరేషన్లు, మునిసిపాలిటీలలో వందశాతం దక్కించుకున్నాయి. కానీ, అనంతపురం విషయానికి వస్తే.. ఇక్కడ వైసీపీ విజయం దక్కించుకుంది. దీంతో అసలు అక్కడ ఏం జరిగింది? అనే విషయం పై సీఎం చంద్రబాబు సీరియస్ అయినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అనంతపురం కార్పొరేషన్ ఎన్నికల కౌంటింగ్, ఫలితాల సరళి, అక్కడ జరిగిన రాజకీయ ఘర్షణలు.. వంటివి రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు వచ్చాయి. కానీ, అనూహ్యంగా ఇక్కడ వైసీపీ విజయం సాధించింది. ఆ పార్టీ అభ్యర్థి రమేష్ గౌడ్ మేయర్ పీఠం ఎక్కనున్నారు. అయితే.. వాస్తవానికి ఈ సీటును బీజేపీకి కేటాయించారు. దీంతో టీడీపీ వర్గాలు, జనసేన కార్యకర్తలను కలసి కట్టుగా బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కానీ, ఎన్నికల అనంతరం.. ఇక్కడ వైసీపీ గెలుపు గుర్రం



ఎక్కడంతో కూటమి నాయకులు ఆశ్చర్యానికి గురయ్యారు.
రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల్లో కూటమి హవా నడుస్తున్నప్పటికీ, అనంతపురం కార్పొరేషన్ పరిధిలో మాత్రం వైసీపీ గెలవడం, అందునా.. కూటమికి గట్టి మద్దతు ఉన్న జిల్లాలో ఇలా జరగడం వంటి అంశాలపై చంద్రబాబు సీరియస్ అయినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఎన్నికల లెక్కింపులో రౌండ్ రౌండ్‌కు సమీకరణాలు మారుతుండం, వైసీపీ గట్టి పోటీ ఇవ్వడంతో, అసలు క్షేత్రస్థాయిలో ఏం జరుగుతోందనే విషయంపై చంద్రబాబు పార్టీ నేతలను అడిగి తెలుసుకున్నారు.

నివేదిక వచ్చాక..
బీజేపీ విషయంలో చంద్రబాబు సానుకూల దృక్పథంతోనే ఉన్నారు. అయితే.. ఈ క్రమంలోనే బీజేపీ కోరిన స్థానాల తో పాటు.. టీడీపీనుంచి పూర్తిస్థాయిలో సహకారం కూడా అందించారు. అందుకే మునుపెన్నడూ లేని విధంగా బీజేపీ పుంజుకుంది. అసెంబ్లీ ఎన్నికలతో పోల్చుకుంటే.. తాజాగా జరిగిన స్థానిక ఎన్నికల్లో కమలం మరింత వికసించింది. కానీ, కీలకమైన కార్పొరేషన్ స్థానంలో బీజేపీ ఓటమి.. అందునా 5 వేల పైచిలుకు ఓట్ల తేడాతో పరాజయం వంటివి చంద్రబాబును కూడా ఆలోచనలో పడేశాయి. దీంతో ఆయన స్థానికంగా టీడీపీ నేతలు ఎలా వ్యవహరించారు? ఏం చేశారు? అనే విషయాలపై నివేదిక కోరినట్టు పార్టీ నేతలు తెలిపారు. నివేదిక వచ్చాక.. తప్పులను సరిచేస్తారని.. అంటున్నారు.

కాంగ్రెస్‌కు షర్మిల అవసరముందా...జగన్‌ను టార్గెట్ చేయడమే రాజకీయమా ?

కాంగ్రెస్ పెద్దలు గమనిస్తున్నారో లేదో కానీ ఏపీలో కాంగ్రె పూర్తిగా వట్టిపోయింది. స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులు పోటీ చేయడానికి ముందుకు వచ్చినా పట్టించుకునే వారే లేరని వాపోతున్న నేపథ్యం ఉంది. ఇక ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల పాత్ర గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది అన్న భావన ఉంది. ఆమె స్థానిక ఎన్నికల వేళ కనీసం పార్టీ వైపు కన్నెత్తి చూడలేదు అన్న ఆరోపణలు ఉన్నాయి. ఎంతసేపూ ఆమె తన అన్న జగన్ ని విమర్శించేందుకే పరిమితం అవుతున్నారు అన్నది కూడా ఉంది. రాజకీయాలో రక్త సంబంధాలకు తావు లేదు, అయితే వైసీపీ అధినేతగా మాజీ సీఎం గా ఆయన్ని విమర్శించడం లేదు, సొంత వ్యవహారాల మీదనే ఆమె విమర్శలు చేస్తున్నారు అన్నది మాత్రం చర్చగా ఉంది.

ఆమె వల్ల లాభమేంటి :
రెండేళ్ల క్రితం ఏపీ కాంగ్రెస్ కి అధినేతగా షర్మిలను తీసుకుని వచ్చారు. ఈ క్రమంలో పార్టీకి ఏమైనా మేలు జరిగిందా అంటే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లుగా ఉంది. వైఎస్సార్ కూతురు అన్న కారణంగానే ఆమెకు ఈ పదవి దక్కింది. కానీ ఆమె మాత్రం కాంగ్రెస్ ని ఏ విధంగానూ బలోపేతం చేయలేకపోయారు అన్నది నిశితమైన విమర్శగా ఉంది. ఆమె జగన్ ని టార్గెట్ చేస్తోంది. అది మీడియాలో వస్తోంది. ఆ హైప్ తోనే చాలు అనుకుంటే కాంగ్రెస్ పెద్దలు ఏపీ వైపు చూడాల్సిన అవసరం లేదని అంటున్నారు. ఎంతసేపూ వ్యక్తిగత విమర్శలకు ఆమె ప్రాధాన్యత ఇస్తారు అన్నది కూడా కాంగ్రెస్ లోనూ జనంలో ఉన్న భావనగా కనిపిస్తోంది.

ఎన్డీయేకు వ్యతిరేకంగా :
కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో ఎన్డీయేకు వ్యతిరేకంగా తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తోంది. మరి కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వానికి ఊపిరి ఇస్తున్న టీడీపీ జనసేన బీజేపీ కూటమి మీద ఏపీలో కాంగ్రెస్ ఎంతలా పోరాడాలి. మచ్చుకైనా అది కనిపిస్తోందా అంటే లేనే లేదు అన్నదే జవాబుగా వస్తోంది. కాంగ్రెస్ అంటేనే దానికి ప్రత్యేకమైన రాజకీయ సిద్ధాంతం ఉంది. మరి దానికి ఏపీలో ఏ మేరకు షర్మిల తీసుకుని వెళ్తున్నారు అన్నది మరో ప్రశ్న. షర్మిల మాత్రం ఏపీలో కూటమి మీద విమర్శలు చేయడం కంటే జగన్ ని టార్గెట్ చేయడం మీదనే ఫోకస్ పెడుతున్నారు అని అంటున్నారు. నిజానికి జగన్, షర్మిల మధ్య వ్యక్తిగత కుటుంబ సంబంధిత వివాదాలు రాజకీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అవే ఇప్పుడు కాంగ్రెస్ వైపు నుంచి కూడా హైలెట్ అవుతున్నాయి. ఆ పార్టీ అజెండా అదే అన్నట్లుగా సెట్ చేసేశారు.

కాంగ్రెస్ పట్ల ప్రేమతోనా :
ఇక్కడ మరో ప్రశ్న కూడా ఉంది. షర్మిల కాంగ్రెస్ సిద్ధాంతాలు నచ్చి పార్టీలో చేరారా లేక కుటుంబ విభేదాలతో అన్న జగన్ కి వ్యతిరేకంగా రాజకీయంగా ఎదుర్కోవాలని చేరారా అంటే దానికి ఆమె కాంగ్రెస్‌లో చేరడానికి ఆస్తుల వివాదమే కారణమని నిర్ధారించే ఆధారాలు బహిరంగంగా లేవు కానీ జరుగుతున్న పరిణామాలు కుటుంబ వివాదాలు, రాజకీయ విమర్శలు ఇవన్నీ జనంలో చర్చగా ఉన్నపుడు ఈ తరహా అనుమానాలు జనంలో వ్యక్తమవుతున్నాయి. షర్మిల జాతీయ పార్టీకి సంబంధించి ఏపీకి ఒక నాయకురాలు. కానీ ఆమె రాజకీయాన్ని వ్యక్తిగత వివాదాలు అధిగమించేలా ప్రభావం చూపడం వల్లనే జనంలో ఈ భావన కలుగుతోంది అని అంటున్నారు.

ఏపీలో కాంగ్రెస్ ఐసీయూలోకి :
ఇప్పుడు కరడు కట్టిన కాంగ్రెస్ అభిమానులు అంతా దీని మీదనే చర్చించుకుంటున్నారు. వైఎస్సార్ చరిష్మాతో ఆయన కుమార్తె కాంగ్రెస్ పగ్గాలు చేపడితే పార్టీకి కొత్త ఊపు వస్తుందని భావించే వారు ఖంగు తినేలా రెండేళ్ల షర్మిల పీసీసీ చీఫ్ వ్యవహారం సాగింది అని అంటున్నారు. నిజానికి కాంగ్రెస్ కార్యకర్తలు ఆశించేది కుటుంబ వివాదాలపై ఆమె స్పందనలు కాదు రాష్ట్రంలో తమ పార్టీని తిరిగి నిలబెట్టే నాయకత్వం అని గట్టిగానే చెబుతున్నారు. ఇక నిజం చెప్పాలీ అంటే షర్మిల రాకముందే ఏపీలో కాంగ్రెస్ తీవ్రంగా దెబ్బ తిని ఉంది. అలాంటి పార్టీని పైకి తీసుకుని వస్తారనే షర్మిలకు ఈ బాధ్యతలు అప్పగించారు. అయితే ఆమె వచ్చిన తర్వాత కాంగ్రెస్ పరిస్థితి ఎంత మెరుగుపడిందనేది కూడా ఇక్కడ పరిశీలిస్తే ఎక్కడ వేసిన గొంగళి అన్న జవాబు వస్తుంది.

సీట్లూ లేవు, ఓట్లూ లేవు :
కాంగ్రెస్ కి గత మూడు ఎన్నికల్లో ఒక్క సీటు కూడా అసెంబ్లీలో లేదు, ఇక షర్మిల నాయకత్వంలో 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ పోరాడింది. అపుడు కూడా ఒక్క అసెంబ్లీ స్థానాన్ని కూడా గెలుచుకోలేదు, అదే విధంగా పార్టీ ఓట్ల శాతం కూడా చాలా తక్కువ స్థాయిలోనే ఉందని అంటున్నారు. మరో వైపు షర్మిల స్వయంగా కడప లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఆమెకు సుమారు 1.41 లక్షల ఓట్లు వచ్చాయి ఇక్కడ షర్మిల గెలుపు సాధించకపోయినా కాంగ్రెస్‌కు కొంత రాజకీయ చర్చను తీసుకురాగలిగారని అంటారు, ఆ మేరకు మాత్రమే సంతృప్తి పడాల్సి ఉంది.

పార్టీ నిర్మాణం ఏదీ :
వైసీపీలోకి కాంగ్రెస్ మొత్తం షిఫ్ట్ అయిపోగా అరకొరగా మిగిలిన పార్టీని పునర్నిర్మించే విధంగా షర్మిల ఏ మేరకు చర్యలు తీసుకున్నారు అన్నది ఇక్కడ ప్రశ్న. షర్మిల వల్ల కాంగ్రెస్ కి ఎంతో కొంత ప్రచారం వచ్చింది, అది మీడియాలోనే. కానీ గ్రాస్ రూట్ లో కాంగ్రెస్ అలాగే ఉంది అని అంటున్నారు. గ్రామాలలో ఈ రోజుకీ కాంగ్రెస్ కి ఎంతో కొంత ఓటు ఉంది, మరి దానిని పటిష్టం చేసే విధంగా యాక్షన్ ప్లాన్ ఉందా అనే లేదు అని జవాబు ఉంది. షర్మిల గతంలో రాష్ట్ర వ్యాప్త పర్యటనలు చేశారు, ఫలితాలు మాత్రం పెద్దగా లేవని అంటున్నారు. ఇక వచ్చే ఎన్నికలకు రెండేళ్ళ సమయం ఉంది. కాంగ్రెస్ కి పోటీ చేసేందుకు ఎంతమంది గట్టి అభ్యర్థులు ఉన్నారు అంటే కూడా సమాధానం లేదు.

కూటమి మీద ఉదాసీనత :
ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు సాగాయి. ఎన్నో సమస్యలు ఏపీలో ఉన్నాయి. ప్రభుత్వ నిర్ణయాలు, ఎన్నికల హామీలు, ఉద్యోగాలు, పెట్టుబడులు, రైతుల సమస్యలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వంటి అంశాలపై ప్రతిపక్ష పార్టీలు నిరంతరం ప్రశ్నించాల్సి ఉంది. ఈ విషయంలో కాంగ్రెస్ నాయకురాలిగా షర్మిల ఏమి చేస్తున్నారు అన్నది కూడా చర్చగా ఉంది. కూటమి మీద షర్మిల విమర్శలు తక్కువగా ఉన్నాయన్న భావన ఇక్కడే జనంలో ఏర్పడుతోంది. జాతీయ స్థాయిలో ఇండియా కూటమి ఎన్డీయేని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. మరి ఏపీలో వామపక్షాలతో కలసి కాంగ్రెస్ కూటమిని గట్టిగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందా లేదా అంటే కూడా జవాబు వెతుక్కోవాల్సి వస్తోంది.

వాయుగుండంతో కుంభవృష్టి

విజయవాడ, నవంబర్ 5
తీవ్ర తుపాను మురసు తీరం దాటిన అనంతరం చూపించిన అసలు ప్రతాపం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సరిహద్దు జిల్లాలను అతలాకుతలం చేసింది. సాధారణంగా తుపాన్లు తీరం దాటిన తర్వాత బలహీనపడటం సహజమే అయినప్పటికీ, మురసు భూభాగంపైకి ప్రవేశించి తీవ్ర వాయుగుండంగా నెమ్మదిగా కదలడం వల్ల కుంభవృష్టిని కురిపించింది. ఆకాశానికి చిల్లు పడిందా అన్న రీతిలో గంటల వ్యవధిలోనే 20 నుంచి 27 సెంటీమీటర్లకు పైగా కుండపోత వర్షం నమోదైంది. తీర ప్రాంత జిల్లాలతో పాటు లోతట్టు ప్రాంతాలు అనూహ్య రీతిలో జలమయమై నదులు, వాగులు ఉగ్రరూపం దాల్చడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని నాలుగు కీలక జిల్లాల్లో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది.గుంటూరు, పల్నాడు, బాపట్ల బెల్ట్‌లో వర్ష తీవ్రత అల్లకల్లోలం సృష్టించింది. గుంటూరు నగరంలో ప్రధాన రహదారులు చెరువులను తలపించగా, సమీప గ్రామీణ ప్రాంతాల్లో నల్లమడ వాగు, నక్కవాగులకు గండ్లు పడి కాకుమాను, పెదనందిపాడు మండలాల్లోని గ్రామాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. యడ్లపాడులో ఐదున్నర గంటల వ్యవధిలోనే ఏకంగా 26.8 సెంటీమీటర్ల వర్షపాతం కురిసి రికార్డు సృష్టించింది. రహదారులపై వెళ్లే వాహనాలు కొట్టుకుపోయేంత స్థాయిలో వరద పోటెత్తింది. గోడలు కూలి, వరద నీటిలో గల్లంతై నలుగురు ప్రాణాలు కోల్పోవడం పరిస్థితి తీవ్రతను చాటుతోంది. లక్షలాది ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి, పత్తి, మిర్చి పైర్లు నీటమునిగి తీవ్ర నష్టం వాటిల్లింది.ఇక ఉమ్మడి కృష్ణా , ఏలూరు జిల్లాల్లోనూ వరద విలయం కొనసాగుతోంది. విజయవాడ పరిసర ప్రాంతాలతో పాటు ఎన్టీఆర్ జిల్లాలోని గంపలగూడెం, నందిగామ, తిరువూరు ప్రాంతాల్లో కట్టలేరు, వైరా నదులు ప్రమాదకర స్థాయికి మించి పొంగి ప్రవహిస్తున్నాయి. దాములూరు కాజ్‌వే, తోటమూల వద్ద రోడ్లు కొట్టుకుపోవడంతో దాదాపు 20కి పైగా గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఏలూరు నగరంలో లోతట్టు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకోగా, పశ్చిమ గోదావరి, ఏలూరు సరిహద్దుల్లోని పంట కాలువలు పొంగిపొర్లుతున్నాయి. ప్రకాశం బ్యారేజీ వద్దకు వరద ఉధృతి క్రమంగా పెరుగుతుండటంతో అధికారులు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.మరోవైపు తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలపై ఈ తుపాను ప్రభావం పెను విలయాన్ని మిగిల్చింది. అశ్వారావుపేట మండలంలో అత్యధికంగా 27.6 సెంటీమీటర్లు, దమ్మపేట, ములకలపల్లి మండలాల్లో 20 సెంటీమీటర్లకు పైగా కురిసిన వర్షానికి చెరువులు, వాగులు కట్టలు తెంచుకున్నాయి. పాల్వంచ-దమ్మపేట ప్రధాన మార్గంలో తాత్కాలిక అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోవడంతో భారీగా రాకపోకలు స్తంభించాయి. వైరా జలాశయం నిండుకుండలా మారగా, మల్లెపూల వాగు ముంచెత్తడంతో వేలాది ఎకరాల పంట పొలాలు నీటమునిగాయి. సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం కలిగింది. సత్తుపల్లి వల్ల చెరువులో చిక్కుకున్న వారిని కాపాడటానికి వెళ్లి ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందే గల్లంతయ్యారు.

పరిషత్ ఎన్నికల పోలింగ్‌లో కడప జిల్లాలో తీవ్ర ఉద్రిక్తత

కడప: పరిషత్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా కడప జిల్లాలో పలుచోట్ల తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పులివెందుల నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. దీంతో పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. పులివెందుల సమీపంలోని పార్నపల్లిలో కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి తన అనుచరులతో కలిసి పోలింగ్ కేంద్రానికి వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, ఎంపీకి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా అవినాశ్ రెడ్డి మాట్లాడుతూ... పెద్ద సంఖ్యలో బయటి వ్యక్తులు జిల్లాలోకి చొరబడ్డారని... రాళ్లు, కర్రలతో తిరుగుతూ వైసీపీ ఏజెంట్లను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పోలీసుల సమక్షంలోనే ఇదంతా జరుగుతోందని, తమ పార్టీ నేతలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, ఆర్ తుమ్మలపల్లిలో టీడీపీ, వైసీపీ వర్గీయులు రాళ్లు, సోడా బాటిళ్లతో పరస్పరం దాడులు చేసుకున్నారు. పోలీసులు జోక్యం చేసుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు. పెద్దముడియం మండలం గుండ్లకుంటలో రెండు పోలింగ్ కేంద్రాల నుంచి టీడీపీ ఏజెంట్లను వైసీపీ నేతలు బయటకు పంపించగా, పోలీసులు కల్పించుకుని వారిని తిరిగి లోపలికి పంపించారు. ఈ వరుస ఘటనల నేపథ్యంలో ఉద్రిక్త ప్రాంతాల్లో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు.

94 శాతం స్ట్రైక్‌రేట్‌ను దాటాలి

రాష్ట్రంలో జరుగుతున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ఇటీవల ముగిసిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలను మించి, పరిషత్ ఎన్నికల్లో అద్భుత విజయం సాధించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. బుధవారం మూడు పార్టీల ముఖ్య నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. స్థానిక స్థాయిలో ఏవైనా అభిప్రాయ భేదాలు ఉంటే వాటిని పక్కనపెట్టి, కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని చంద్రబాబు సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో కూటమి 94 శాతం స్ట్రైక్ రేట్ సాధించిందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. గత రెండున్నరేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు, సుపరిపాలనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారని అన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని, మనం ప్రజలకు అండగా నిలిస్తే వారూ మనకు తోడుంటారని పేర్కొన్నారు. మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా నేడు పరిషత్ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. మొత్తం 7,770 ఎంపీటీసీ, 582 జెడ్పీటీసీ స్థానాలకు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 7వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి నాదెండ్ల మనోహర్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ నేత పీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ క్వారీలో వాచ్‌మెన్ అనుమానాస్పద మృతి

రేకుల షెడ్‌లో లభ్యమైన లక్ష్మీనారాయణ మృతదేహం

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం బెరువాడ సమీపంలోని కాకతీయ గ్రానైట్ క్వారీలో వాచ్‌మెన్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గురువారం తెల్లవారుజామున ఈ ఘటన వెలుగుచూసింది. వివరాల్లోకి వెళ్తే.. క్వారీలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న దారం లక్ష్మీనారాయణ (60) మృతదేహం క్వారీలోని ఓ రేకుల షెడ్‌లో లభ్యమైంది. విధుల్లో ఉన్న సమయంలోనే మృతి చెందడంతో ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. అయితే ఆయన మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు, స్థానికుల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు తెలిపారు. పోలీసుల విచారణ అనంతరం మృతికి గల కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

ఏపీ పరిషత్ ఎన్నికల్లో ఓటు వేసిన బోయపాటి శ్రీను

గుంటూరు: ప్రముఖ సినీ దర్శకుడు బోయపాటి శ్రీను ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. గుంటూరు జిల్లాలోని తన స్వగ్రామం పెదకాకానిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. సాధారణ పౌరుడిలాగే క్యూలో నిల్చొని తన వంతు వచ్చినప్పుడు ఓటు వేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రం వద్ద ఉన్న కొద్దిమంది అభిమానులు, స్థానికులతో ఆయన మాట్లాడారు. ప్రతి ఎన్నికల్లోనూ ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా సామాన్య ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తుంటారు. అందులో భాగంగానే బోయపాటి శ్రీను కూడా తన స్వస్థలంలో ఓటు వేసి తన పౌర బాధ్యతను నెరవేర్చారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

పారా క్రీడల్లో భారత్ పతకాల ప్రభంజనం!



న్యూఢిల్లీ: జపాన్‌లో జరిగిన ఆసియా పారా గేమ్స్-2026లో భారత అథ్లెట్లు కనబరిచిన అద్భుత ప్రదర్శనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. పారా క్రీడల్లో భారత క్రీడాకారుల విజయాలు అంతర్జాతీయ క్రీడా రంగంలో దేశం సాధిస్తున్న ప్రగతికి నిదర్శనమని కొనియాడారు. 2010లో ఒక స్వర్ణ పతకంతో సహా 14 పతకాలు సాధించిన భారత్.. ఈసారి ఏకంగా 114 పతకాలను కైవసం చేసుకోవడం గొప్ప పరిణామమన్నారు. అథ్లెట్ల కఠోర శ్రమ, అంకితభావంతో పాటు దేశంలో బలోపేతమవుతున్న క్రీడా వ్యవస్థ ఈ విజయాలకు కారణమని పేర్కొన్నారు. గురువారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పారా అథ్లెట్లతో మోదీ సమావేశమయ్యారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో వారిని ఉద్దేశించి ప్రసంగించారు. "మిమ్మల్ని అందరినీ కలవాలని ఎంతో ఆసక్తిగా ఎదురుచూశాను. కొన్ని వారాల క్రితం ఆసియా క్రీడల్లో పాల్గొన్న అథ్లెట్లను కలిశాను. ఇప్పుడు ఆసియా పారా గేమ్స్‌లో సత్తా చాటిన క్రీడాకారులను కలుసుకోవడం ఆనందంగా ఉంది. అంతర్జాతీయ క్రీడా రంగంలో భారత శక్తిని మీ విజయాలు చాటిచెప్పాయి. ఒకప్పుడు పారా క్రీడల్లో భారత్ వెనుకబడి ఉండేది. 2010లో కేవలం 14 పతకాలు సాధించిన మన దేశం.. ఇప్పుడు 114 పతకాలతో సరికొత్త చరిత్ర సృష్టించింది. 30 స్వర్ణాలు, 35 రజతాలు, 49 కాంస్య పతకాలతో పాటు ఐదు ప్రపంచ రికార్డులు, తొమ్మిది ఆసియా రికార్డులు సాధించి దేశాన్ని గర్వపడేలా చేశారు" అని మోదీ ప్రశంసించారు.

మహిళా అథ్లెట్లకు ప్రశంసలు

పారా గేమ్స్‌లో మహిళా అథ్లెట్లు కనబరిచిన ప్రతిభను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. భారత్ తరఫున పోటీపడిన 56 మంది మహిళా అథ్లెట్లలో 34 మంది పతకాలు సాధించడం విశేషమన్నారు. క్రీడల్లో మహిళల భాగస్వామ్యం, విజయాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు.

తల్లి జ్ఞాపకంతో రింకు భావోద్వేగం

జావెలిన్ త్రో అథ్లెట్ రింకు విజయాన్ని మోదీ గుర్తుచేసుకున్నారు. ఆసియా పారా గేమ్స్‌కు రెండు నెలల ముందే తల్లిని కోల్పోయిన రింకు.. తీవ్ర విషాదాన్ని దిగమింగుకుని పోటీల్లో పాల్గొని స్వర్ణ పతకం సాధించారని తెలిపారు. పతకం గెలిచిన అనంతరం తన తల్లి ఫొటోను చేతిలో పట్టుకుని ఆ విజయాన్ని ఆమెకు అంకితం చేయడం అందరినీ కదిలించిందన్నారు.

మారిన క్రీడా వ్యవస్థ

గతంలో క్రీడారంగంలో తగినన్ని వనరులు, ప్రోత్సాహం, పారదర్శకత లేకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల్లోకి పంపేందుకు ఆసక్తి చూపేవారు కాదని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పరిస్థితుల్లో మార్పు వస్తోందని, క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు వ్యవస్థ బలోపేతమవుతోందని చెప్పారు. నాలుగు క్రీడా విభాగాల్లో స్వర్ణం, రజతం, కాంస్యం.. మూడు పతకాలనూ భారత అథ్లెట్లే సాధించి పోడియంపై త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించారని మోదీ తెలిపారు. పోటీల చివరి రోజున భారత క్రీడాకారులు తొమ్మిది స్వర్ణ పతకాలు సాధించడం విశేషమని కొనియాడారు.

అధికారం కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తుంది



ముంబై: మహారాష్ట్రలోని మహాయుతి ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. కొల్హాపూర్‌లోని గోకుల్ డెయిరీ సహకార సంస్థ ఎన్నికల్లో ప్రజా తీర్పును తారుమారు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. డైరెక్టర్ల బోర్డులో మెజారిటీ సాధించేందుకు ఎన్నికల అనంతరం నిబంధనలను మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ మేరకు గురువారం తన ఎక్స్ ఖాతాలో ఆయన పోస్టు చేశారు. "గోకుల్ డెయిరీ ఎన్నికల్లో పాల ఉత్పత్తిదారులు బీజేపీ కూటమిని ఓడించారు. అందుకే ఎన్నికల తర్వాత నిబంధనలను మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. బోర్డులో నలుగురు డైరెక్టర్లను నియమించి, 12 మందిని 16 మందిగా మార్చడం ద్వారా మెజారిటీని దక్కించుకోవాలని చూస్తున్నారు. ఇది పాల ఉత్పత్తిదారుల ఓట్లను దొంగిలించడమే. ప్రజా తీర్పును కల్తీ చేయడమే. అధికారాన్ని కాపాడుకోవడానికి బీజేపీ ఎంతకైనా తెగిస్తోంది. రైతుల ఓట్లను దొంగిలించే వారిని రైతాంగం ఎప్పటికీ మరచిపోదు" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్యానెల్‌కు 13 స్థానాలు

ఈ వ్యవహారంపై కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేడా చేసిన పోస్టును కూడా రాహుల్ గాంధీ తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. అక్టోబర్ 19న జరిగిన గోకుల్ డెయిరీ ఎన్నికల్లో మొత్తం 25 స్థానాలకు పోటీ జరగగా, కాంగ్రెస్ నేత సతేజ్ పాటిల్ నేతృత్వంలోని ప్యానెల్ 13 స్థానాల్లో విజయం సాధించిందని పవన్ ఖేడా తెలిపారు. మహాయుతి కూటమి మద్దతున్న ప్యానెల్ 12 స్థానాలకే పరిమితమైందన్నారు. అయితే, డైరెక్టర్ల సమావేశానికి అవసరమైన కోరం లేకపోవడంతో ఛైర్మన్ ఎన్నిక వాయిదా పడిందని పేర్కొన్నారు. మహాయుతి మద్దతున్న డైరెక్టర్లు సమావేశాలకు హాజరు కాకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో నవంబర్ 10న తిరిగి ఎన్నికలు నిర్వహించాలని బాంబే హైకోర్టు ఆదేశించినట్లు వెల్లడించారు.

నామినేటెడ్ సభ్యుల నియామకంపై వివాదం

ఎన్నికైన డైరెక్టర్ల బోర్డు కార్యకలాపాలను ప్రభావితం చేసేలా మహారాష్ట్ర మంత్రివర్గం కొత్త ప్రతిపాదనకు ఆమోదం తెలిపిందని పవన్ ఖేడా ఆరోపించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులను మినహాయించి, రూ.500 కోట్లకు పైగా వార్షిక టర్నోవర్ కలిగిన సహకార సంస్థల మేనేజింగ్ కమిటీల్లో ఐదుగురు ప్రభుత్వ నామినేటెడ్ సభ్యులను నియమించే ప్రతిపాదన తీసుకొచ్చిందన్నారు. వీరిలో నలుగురికి ఓటు హక్కు కల్పించే నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు ప్రభావితం అయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సహకార సంస్థల స్వయంప్రతిపత్తిని కాపాడేందుకు న్యాయపోరాటం చేస్తామని, అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

ఓటరు కార్డుపై కాంగ్రెస్ అభ్యంతరం

ఇదిలా ఉండగా, సంక్షేమ పథకాల లబ్ధిదారులను గుర్తించేందుకు ఆధార్‌తో పాటు ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్)ను ఉపయోగించాలన్న కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ వ్యాఖ్యలపైనా కాంగ్రెస్ స్పందించింది. ఓట్ల చోరీ కేవలం ట్రైలర్ మాత్రమేనని, అసలు కథ హక్కుల చోరీ అని విమర్శించింది. ఈ అంశంపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ స్పందిస్తూ, సంక్షేమ పథకాల లబ్ధిదారుల గుర్తింపునకు ఆధార్‌కు బదులుగా ఓటరు గుర్తింపు కార్డును ఉపయోగించాలన్న ప్రతిపాదనపై ప్రశ్నలు లేవనెత్తారు. కేంద్ర ప్రభుత్వ అధికారిక విధానం ఇదేనా అని నిలదీశారు.

ధైర్యముంటే ప్రధానికి లేఖ రాయండి



కర్నాల్: ఎస్ఐఆర్, ఈవీఎంల వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీతో బహిరంగ చర్చకు రావాలంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన సవాల్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. చర్చించాలనే చిత్తశుద్ధి, ధైర్యం ఉంటే ప్రధానమంత్రికి అధికారికంగా లేఖ రాయాలని సూచించారు. ఎస్ఐఆర్, ఈవీఎంలు, చొరబాటుదారుల అంశాలపై చర్చించేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. హరియాణాలోని కర్నాల్‌లో బీజేపీ నిర్వహించిన 'లోక్‌తంత్ర బచావో.. అరాజకత హఠావో' యాత్రలో ఆయన ప్రసంగించారు.

రాహుల్‌పై అమిత్ షా విమర్శలు

పార్లమెంట్‌ను సజావుగా నడపనివ్వకుండా బయట రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకుని తిరిగితే సరిపోదని, ప్రవర్తన కూడా రాజ్యాంగబద్ధంగా ఉండాలని అమిత్ షా వ్యాఖ్యానించారు. పార్లమెంట్‌లో చర్చలకు సహకరించకుండా వాకౌట్లు, ఆందోళనలకు దిగడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు. మృతుల పేర్లతో పాటు బంగ్లాదేశ్ చొరబాటుదారులు, రోహింగ్యాల పేర్లతో ఉన్న బోగస్ ఓట్లను ఎన్నికల సంఘం తొలగిస్తుంటే కాంగ్రెస్‌కు అభ్యంతరం ఎందుకని ప్రశ్నించారు. చొరబాటుదారులే కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకుగా ఉన్నారని, అందుకే ఓటర్ల జాబితా ప్రక్షాళనను అడ్డుకునేందుకు 'ఓట్ల చోరీ' అంటూ ప్రచారం చేస్తోందని ఆరోపించారు. దేశ పౌరులకు మాత్రమే ఓటు హక్కు ఉండాలని, చొరబాటుదారుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని అన్నారు.

పార్లమెంట్ చర్చలకు సహకరించాలి

ప్రజాస్వామ్యంలో పార్లమెంట్ అత్యున్నత చర్చా వేదిక అని అమిత్ షా పేర్కొన్నారు. కీలక అంశాలపై అక్కడ చర్చించకుండా కాంగ్రెస్ అడ్డంకులు సృష్టిస్తోందని విమర్శించారు. పార్లమెంట్‌ను పనిచేయనివ్వకుండా బయట ఆందోళనలు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. దేశంలోని పార్లమెంట్, శాసనసభలు, గ్రామాలు, పొలాల్లోనూ బీజేపీ కాంగ్రెస్‌కు తగిన సమాధానం ఇస్తుందని అన్నారు. ప్రజలను సమీకరించి ఆందోళనలు చేయాలని కాంగ్రెస్ భావిస్తే ఎదుర్కొనేందుకు బీజేపీ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

ఓటు హక్కు విలువను వివరించిన సైనీ

హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ కూడా కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. ప్రజాస్వామ్యానికి సామాన్య పౌరుడి ఓటే అతిపెద్ద బలమని పేర్కొన్నారు. సంపద, పలుకుబడి, రాజకీయ నేపథ్యంతో సంబంధం లేకుండా పోలింగ్ బూత్‌లో ప్రతి ఒక్కరికీ సమాన ఓటు హక్కు ఉంటుందని వివరించారు. రైతులు, కార్మికులు, యువత, మహిళల ఆకాంక్షలకు ఓటు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఎన్నికల సంఘం చేపట్టే ఓటర్ల జాబితా సవరణ సాధారణ ప్రక్రియేనని సైనీ పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ అసత్య ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో మహిళలు, యువత, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని బీజేపీ నేతలు పేర్కొన్నారు.

చర్చకు సిద్ధమన్న రాహుల్

కాగా, అంతకుముందు రాహుల్ గాంధీ ప్రధాని మోదీతో బహిరంగ చర్చకు తాను సిద్ధమని ప్రకటించారు. దేశంలోని 73 శాతం మంది యువత తమ మధ్య చర్చ జరగాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రధాని ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదని, కీలక దేశీయ అంశాలపై చర్చించేందుకు ముందుకు వస్తే చాలన్నారు. నిరుద్యోగం, దేశ భద్రత, ఆర్థిక వ్యవస్థ వంటి ప్రజా సమస్యలపై దేశంలోని ఇద్దరు అగ్రనేతలు ఒకే వేదికపై చర్చించడం ప్రజాస్వామ్యానికి అవసరమని రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు.

దేశవ్యాప్తంగా వందే భారత్ హవా..

దేశంలో ప్రవేశపెట్టిన సెమీ-హై-స్పీడ్ రైళ్లు వందే భారత్ సర్వీసులకు ప్రయాణికుల నుంచి అపూర్వ స్పందన లభిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఈ రైళ్ల ఆక్యుపెన్సీ గణాంకాలు వాటి విజయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా, తిరువనంతపురం సెంట్రల్-మంగళూరు సెంట్రల్ మధ్య నడిచే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఏకంగా 189.35% ఆక్యుపెన్సీతో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచి సరికొత్త రికార్డు సృష్టించింది. రైల్వే బోర్డు అధికారి వెల్లడించిన వివరాల ప్రకారం, దేశవ్యాప్తంగా నడుస్తున్న అన్ని వందే భారత్ చైర్ కార్ సర్వీసుల్లో కలిపి సగటు ఆక్యుపెన్సీ 99.10%గా నమోదైంది. జనవరి 2026లో ప్రారంభమైన తొలి వందే భారత్ స్లీపర్ రైలు (హౌరా-కామాఖ్య) కూడా ప్రయాణికులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ రైలులో ఏకంగా 114.54% ఆక్యుపెన్సీ నమోదైనట్లు ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తన కథనంలో పేర్కొంది. ఆక్యుపెన్సీలో రికార్డు సృష్టించిన తిరువనంతపురం-మంగళూరు రూట్‌లో, తిరువనంతపురం నుంచి మంగళూరు వెళ్లే రైలు (20632) 189.35% ఆక్యుపెన్సీ నమోదు చేయగా, మంగళూరు నుంచి తిరువనంతపురం వచ్చే రైలు (20631) 174.77% ఆక్యుపెన్సీ సాధించింది. 100% కంటే ఎక్కువ ఆక్యుపెన్సీ ఉండటం అంటే, అందుబాటులో ఉన్న సీట్ల కంటే ఎక్కువ మంది ప్రయాణికులు వెయిటింగ్ లిస్ట్‌లో ఉండి ప్రయాణించడానికి సిద్ధంగా ఉన్నారని అర్థం. ఇది ఈ రూట్లలో డిమాండ్ ఏ స్థాయిలో ఉందో సూచిస్తోంది. అదేవిధంగా, ఢిల్లీ-వారణాసి మధ్య నడిచే రెండు జతల వందే భారత్ చైర్ కార్ సర్వీసులు కూడా 114% నుంచి 117% పైగా ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి.

కొత్తగా స్లీపర్ సర్వీసులు:

వందే భారత్ రైళ్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ మరిన్ని స్లీపర్ సర్వీసులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. కర్ణాటకకు రెండో వందే భారత్ స్లీపర్ రైలును కేటాయించినట్లు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఇటీవల ప్రకటించారు. ఈ రైలు బెంగళూరు నుంచి హుబ్బళ్లి మీదుగా ముంబై వరకు నడవనుంది. దీనివల్ల ఉత్తర కర్ణాటక, పుణె, ముంబై నగరాల మధ్య ప్రయాణం సులభతరం కానుంది. కాగా, ఢిల్లీ-వారణాసి మార్గంలో అక్టోబర్ 31, 2026న ఒక వందే భారత్ స్లీపర్ రైలును ఇప్పటికే ప్రారంభించారు. 2019లో ప్రారంభమైన వందే భారత్ సేవలు ప్రస్తుతం దేశవ్యాప్తంగా 160కి పైగా సర్వీసులకు విస్తరించాయి.

ఏడు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా సవరణ



న్యూఢిల్లీ: ఏడు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాల వార్షిక ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్) చేపట్టనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా యువతకు ఓటరు జాబితాలో చోటు కల్పించడం ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని వెల్లడించింది. ఇందుకోసం అవసరమైన సిబ్బందిని సమకూర్చాలని ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు లేఖ రాసింది. నకిలీ ఓటరు ఎంట్రీలు, ఒకే వ్యక్తి పేరుతో పలుచోట్ల ఓట్లు ఉన్నాయనే ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని ఆదేశించింది.

నవంబర్ 30న ముసాయిదా జాబితా

అరుణాచల్‌ప్రదేశ్, చండీగఢ్, దాద్రా నగర్ హవేలీ, డామన్ అండ్ డయ్యూ, మిజోరం, ఒడిశా, సిక్కింలలో ఈ ప్రత్యేక సంక్షిప్త సవరణ చేపట్టనున్నారు. 2027 ఏప్రిల్ 1, జులై 1, అక్టోబర్ 1 తేదీల నాటికి ఓటు హక్కు పొందే అర్హత కలిగిన వారి నుంచి ముందస్తు దరఖాస్తులు స్వీకరించనున్నారు. అభ్యంతరాలు, దరఖాస్తుల పరిశీలన అనంతరం నవంబర్ 30న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. 2027 జనవరి 21న తుది జాబితాను ప్రకటించనున్నారు.

ఆధార్ తప్పనిసరి కాదు

కొత్త ఓటరు నమోదుకు ఉపయోగించే ఫారం-6, వివరాల మార్పులు, చేర్పుల కోసం వినియోగించే ఫారం-8లో ఆధార్ వివరాలు సమర్పించడం పూర్తిగా స్వచ్ఛందమని ఈసీ స్పష్టం చేసింది. ఆధార్ వివరాలు ఇవ్వలేదనే కారణంతో ఏ దరఖాస్తునూ తిరస్కరించరాదని, ఇప్పటికే ఓటరు జాబితాలో ఉన్న వారి పేర్లను తొలగించరాదని పేర్కొంది.

ఓట్ల తొలగింపుపై నిఘా

ఒకే వ్యక్తి పేరు పలుమార్లు నమోదైందనే కారణంతో ఓట్లను తొలగించే ముందు క్షేత్రస్థాయి పరిశీలన తప్పనిసరి చేసింది. ఒక పోలింగ్ కేంద్రం పరిధిలో రెండు శాతానికి మించి ఓట్ల తొలగింపులు ఉన్నా, ఒకే వ్యక్తి ఐదు కంటే ఎక్కువ అభ్యంతరాలు వ్యక్తం చేసినా సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్ఓలు) స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని ఆదేశించింది.

పది రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ

మరోవైపు, పది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్) షెడ్యూల్‌ను తర్వాత ప్రకటించనున్నట్లు ఈసీ తెలిపింది. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ కొనసాగుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్, హరియాణా, ఝార్ఖండ్, కర్ణాటక, మహారాష్ట్ర, మేఘాలయ, నాగాలాండ్, ఢిల్లీ, త్రిపుర, తెలంగాణ రాష్ట్రాలు ఈ జాబితాలో ఉన్నాయి. ఎస్ఐఆర్ ఇంకా ప్రారంభం కాని హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లలో వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్‌ను విడిగా ప్రకటించనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది.

ఐటీ విభాగం పర్యవేక్షణలో మార్పు

ఇదిలా ఉండగా, ఎన్నికల సంఘం ఐటీ విభాగం అంతర్గత రిపోర్టింగ్ వ్యవస్థలో మార్పులపై ఓ అధికారి స్పష్టతనిచ్చారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎప్పటిలాగే డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ పర్యవేక్షణలోనే ఉంటారని తెలిపారు. బుధవారం జారీ చేసిన తాజా ఉత్తర్వుల ప్రకారం, ప్రస్తుత డీజీ (ఐటీ) సెర్మా ఖన్నా ఇకపై కొత్తగా నియమితులైన డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ ప్రకాశ్ రాజ్ పురోహిత్ పర్యవేక్షణలో పనిచేయనున్నారు. ఈ మార్పుతో పర్యవేక్షణ వ్యవస్థలో ప్రాథమిక నిబంధనలు మారలేదని అధికారి వివరించారు.

విదేశీయుల పాస్‌పోర్ట్, వీసా నిబంధనల్లో సడలింపు

న్యూఢిల్లీ: భారత్‌లో నివసిస్తున్న పలు వర్గాల విదేశీ పౌరులకు కేంద్ర ప్రభుత్వం ఊరట కల్పించింది. నిర్దిష్ట అర్హతలు కలిగిన పాకిస్థాన్ పౌరులు, మతపరమైన వేధింపుల కారణంగా భారత్‌కు వచ్చిన మైనార్టీ శరణార్థులు, శ్రీలంక తమిళులు, టిబెటన్లకు పాస్‌పోర్ట్, వీసా నిబంధనల నుంచి ప్రత్యేక మినహాయింపులు కల్పించింది. భారత్-నేపాల్--భూటాన్ మధ్య ప్రయాణించే పౌరుల గుర్తింపు పత్రాల నిబంధనల్లోనూ మార్పులు చేసింది. ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నవంబర్ 5న 'ది ఇమిగ్రేషన్ అండ్ ఫారినర్స్ (ఎగ్జెంప్షన్) (అమెండ్‌మెంట్) ఆర్డర్--2026'ను గెజిట్‌లో ప్రచురించింది.

పాక్ పౌరులకు ప్రత్యేక వెసులుబాటు

2009 డిసెంబర్ 31 లేదా అంతకంటే ముందే శాశ్వత నివాసం ఏర్పరచుకునే ఉద్దేశంతో పాకిస్థాన్ నుంచి భారత్‌కు వచ్చిన పౌరులకు కేంద్రం ప్రత్యేక మినహాయింపు ఇచ్చింది. పాకిస్థాన్ ప్రభుత్వం జారీ చేసే కంప్యూటరైజ్డ్ నేషనల్ ఐడెంటిటీ కార్డు (సీఎన్ఐసీ) లేకపోవడంతో పాస్‌పోర్టును పునరుద్ధరించుకోలేని వారు ఈ వెసులుబాటు పొందవచ్చు. అయితే భారత్‌లో కొనసాగి ఉండేందుకు తగిన కేటగిరీ వీసా పొందాల్సి ఉంటుంది.

కేరళలో స్థిరపడిన వారికి మరో మినహాయింపు

విభజన అనంతరం 1947 ఆగస్టు 15 నుంచి 1965 డిసెంబర్ 31 మధ్య పాకిస్థాన్‌కు వెళ్లిన భారతీయ మూలాలున్న ముస్లిం పురుషుల్లో కొందరికి కూడా మినహాయింపు కల్పించారు. వారు 2009 డిసెంబర్ 31లోపు పాకిస్థాన్ పాస్‌పోర్టుపై తిరిగి భారత్‌కు వచ్చి కేరళలో స్థిరపడి ఉండాలి. పాకిస్థాన్‌లో ఉన్నప్పుడు వివాహం చేసుకోకపోవడం, అక్కడ స్థిరాస్తులు కొనుగోలు చేయకపోవడం, భారత్‌లో భారత పౌరులుగా ఉన్న కుటుంబ సభ్యులను వదిలి వెళ్లి ఉండటం వంటి షరతులు వర్తిస్తాయి. ఇకపై పాకిస్థాన్‌కు తిరిగి వెళ్లబోమని హామీ ఇవ్వాలి. పోలీసు, భద్రతా సంస్థల నుంచి ప్రతికూల నివేదికలు ఉండకూడదు.

భారత మూలాలున్న మలేసియా, సింగపూర్ పౌరులకూ

గతంలో భారత పాస్‌పోర్టు కలిగి ఉన్నవారు లేదా వారి తల్లిదండ్రులు, తాతముత్తాతలు భారతదేశంలో జన్మించి శాశ్వత నివాసితులుగా ఉన్నవారిని భారత మూలాలున్న వ్యక్తులుగా (పీఐఓ) పరిగణిస్తారు. అయితే పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, అఫ్గానిస్థాన్, నేపాల్, భూటాన్, చైనా పౌరులకు ఈ నిర్వచనం వర్తించదు. మలేసియా లేదా సింగపూర్ పౌరసత్వం పొందిన భారత మూలాలున్న వ్యక్తులు 2009 డిసెంబర్ 31లోపు ఆయా దేశాల పాస్‌పోర్టులపై భారత్‌కు తిరిగి వచ్చి ఉండాలి. ఆ దేశాల నిబంధనల ప్రకారం పాస్‌పోర్టు పునరుద్ధరణకు అర్హత లేకపోవడంతో గడువు ముగిసిన వారికి కూడా మినహాయింపు వర్తిస్తుంది. అయితే భారత మూలాలను నిరూపించే పత్రాలు ఉండాలి. వీరంతా భారత్‌లో కొనసాగేందుకు తగిన వీసా పొందాలి.

మైనార్టీ శరణార్థులకు ఊరట

అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్‌కు చెందిన హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ, క్రైస్తవ మతస్థులకు కూడా కేంద్రం మినహాయింపులు ఇచ్చింది. మతపరమైన వేధింపులు లేదా వాటి భయంతో 2024 డిసెంబర్ 31 లేదా అంతకంటే ముందుగా భారత్‌కు వచ్చిన వారికి ఈ వెసులుబాటు వర్తిస్తుంది. సరైన పాస్‌పోర్టు, ప్రయాణ పత్రాలు లేకుండా పచ్చినవారితో పాటు వాటి గడువు ముగిసిన వారికి కూడా మినహాయింపు ఉంటుంది. అయితే భారత్‌లో కొనసాగేందుకు తగిన కేటగిరీ వీసా తప్పనిసరిగా పొందాలి.

శ్రీలంక తమిళులు, టిబెటన్లకూ మినహాయింపు

2015 జనవరి 9 లేదా అంతకంటే ముందు భారత్‌లో ఆశ్రయం పొందిన, సంబంధిత ప్రభుత్వ అధికారుల వద్ద నమోదు చేసుకున్న శ్రీలంక తమిళులకు పాస్‌పోర్టు, వీసా నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చారు.

సంపాదకీయం

పునర్నిర్మాణానికి అండ!

వారం రోజుల్లో రెండు తుపాన్లు, అర్నాబ్, మురసు, ఆంధ్రప్రదేశ్ తీరాన్ని కుదిపేశాయి. ముందస్తు సన్నద్ధత, సాంకేతికత వల్ల ప్రాణనష్టం తగ్గినా, అర్నాబ్ నష్టమే సుమారు రూ.4,500 కోట్లు దాటింది. వేలాది హెక్టార్ల పంటలు నీట మునిగి, వేల విద్యుత్ స్తంభాలు, సెల్ టవర్లు కూలాయి. తక్షణ సాయంగా రూ.4,500 కోట్లకు పైగా ఇవ్వాలని రాష్ట్రం కేంద్రాన్ని కోరింది. పంట బీమా పథకాన్ని మెరుగుపరచి, శాశ్వత పునర్నిర్మాణానికి కేంద్రం అండగా నిలవాలన్నదే ఇప్పటి డిమాండ్. వారం రోజుల్లో రెండు తుపాన్లు, అర్నాబ్, మురసు, ఆంధ్రప్రదేశ్ తీరాన్ని తాకాయి. ముందస్తు సన్నద్ధత, అధికారుల వేగవంతమైన స్పందన వల్ల ప్రాణనష్టం తక్కువగా ఉండటం ఊరట కలిగించే విషయం. అక్టోబర్ 28న అర్నాబ్ 'అతి తీవ్ర తుపాను'గా యానాం, నరసాపురం మధ్య తీరం దాటింది. ఈ తుపాను వల్ల రాష్ట్రంలో నష్టం సుమారు రూ.4,526 కోట్ల నుంచి రూ.4,600 కోట్ల వరకు ఉంటుందని అంచనా. పంటలకూ భారీ నష్టం జరిగింది: ముఖ్యమంత్రి చెప్పిన ప్రకారం సుమారు 70,900 హెక్టార్ల వరి, 10,450 హెక్టార్ల ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి; మరికొన్ని అంచనాల ప్రకారం మొత్తం 3 లక్షల హెక్టార్లకు పైగా పంట మునిగింది. అర్నాబ్ కారణంగా ఒడిశా దక్షిణ ప్రాంతాల్లో కూడా సుమారు 75,000 నుంచి 90,000 హెక్టార్ల పంటలు దెబ్బతిన్నాయి. ఆ తర్వాత నవంబర్ 3న ఒంగోలు దగ్గర మురసు తుపాను తీరం దాటింది. ప్రాథమిక అంచనా ప్రకారం 15 జిల్లాల్లో సుమారు 52,500 హెక్టార్ల నిలువు పంటలు దెబ్బతిన్నాయి, నష్టం సుమారు రూ.344 కోట్లు. రెండు తుపాన్లతో ఆంధ్రప్రదేశ్‌లో ఏడుగురు చనిపోయారని రాష్ట్రం తెలిపింది (కొన్ని నివేదికల్లో ఈ సంఖ్య కొంత ఎక్కువగా ఉంది). 'తీవ్ర తుపాను' హెచ్చరికల తర్వాత 57,000 మందిని, మురసు ముందు 30,000 మందిని సురక్షిత కేంద్రాలకు తరలించారు. కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు నుంచి సహాయక బృందాలు కూడా ఆంధ్రప్రదేశ్‌కు తరలివచ్చాయి. రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్), డాప్లర్ రాడార్లు వంటి సాంకేతికత మానవ నష్టాన్ని, ఆస్తి నష్టాన్ని గణనీయంగా తగ్గించింది. 2014 అక్టోబర్‌లో హుద్‌హుద్ తుపానులో 63 మంది చనిపోగా, నష్టం సుమారు రూ.22,000 కోట్లు ఉంది; దానితో పోలిస్తే ఇప్పటి పరిస్థితి చాలా మెరుగు. అయితే సహజ విపత్తులు మన దేశంలో తరచుగా వస్తున్నాయి. ఈ ఏడాది ఎల్‌నినో కారణంగా ఉత్తర హిందూ మహాసముద్రంలో తుపాన్లు తగ్గుతాయని అంచనా వేసినా, ఐదు రోజుల్లో రెండు తుపాన్లు వచ్చాయి. కాబట్టి ముందస్తు అంచనా, నష్ట నివారణ కోసం ఉన్నత విద్యా సంస్థలు, ముఖ్యంగా సైన్స్, టెక్నాలజీ సంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల మధ్య మరింత సహకారం అవసరం.

తుపాను దెబ్బ ఎక్కువగా తగిలేది రైతులకే. పంట నష్టానికి సమర్థవంతమైన పరిహార విధానాన్ని అధికారులు రూపొందించాలి. పదేళ్ల క్రితం కేంద్రం ప్రారంభించిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై), ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయే రైతులకు సమగ్ర భద్రత ఇవ్వలేకపోయిందన్న విమర్శ ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో 22 నోటిఫై చేసిన పంటలకు రూ.15,969 కోట్ల బీమా కవరేజీ ఉంది; అర్నాబ్ వల్ల సుమారు 4.6 లక్షల మంది రైతులు ప్రభావితమయ్యారని అంచనా. బీమా క్లెయిమ్‌లు, ఇన్‌పుట్ సబ్సిడీని వేగంగా ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ రైతులకు గరిష్ఠ సాయం ఇప్పిస్తామని, పంట నష్టం అంచనా తర్వాత అదనపు ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని హామీ ఇచ్చారు; ఎకరాకు రూ.700-800 ప్రీమియంతో పంట బీమా తీసుకోవాలని రైతులకు సలహా ఇచ్చారు. కానీ చాలామంది రైతులు, ముఖ్యంగా కౌలు రైతులు, బీమా పరిధిలో లేరు; ప్రీమియం కట్టలేనివారు, పథకం గురించి తెలియనివారు చాలా మంది. అందుకే కేంద్రం ఈ పథకాన్ని మెరుగుపరచాలి, తద్వారా అన్ని రైతులు తమ పంటలను ఇందులో చేర్చేలా ప్రోత్సాహం లభించాలి. రాష్ట్ర ప్రభుత్వాలు బీమా గురించి అవగాహన పెంచాలి, బీమా పరిధిలోని ప్రయోజనాలకు అదనంగా తమ వాటాను జత చేసి రైతులకు తోడ్పాటు ఇవ్వాలి. క్లెయిమ్‌ల చెల్లింపు ఆలస్యం కాకుండా చూడటం, కౌలు రైతులకు సబ్సిడీ నేరుగా చేరేలా చేయడం కూడా అంతే ముఖ్యం.

ఇక కేంద్ర, రాష్ట్ర సంబంధాల విషయం. తుపాను తర్వాత ప్రజా మౌలిక సదుపాయాలు ఎంతగా దెబ్బతిన్నాయో మురసు తుపాను చూపింది: సుమారు 31,000 విద్యుత్ స్తంభాలు, 200 సెల్ టవర్లు దెబ్బతిన్నాయి, 4,095 గ్రామాల్లో కరెంటు పోయింది, 312 ఇళ్లు కూలిపోయాయి. అర్నాబ్ 781 గ్రామాలను, మురసు 465 గ్రామాలను ప్రభావితం చేశాయి. ఈ సందర్భంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లాడి, తక్షణ కేంద్ర సాయంగా రూ.4,500 కోట్లకు పైగా కోరుతూ లేఖ రాశారు (అర్నాబ్‌కు రూ.4,563 కోట్లు, మురసుకు రూ.343 కోట్లు). కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా ముఖ్యమంత్రితో మాట్లాడి అన్ని విధాల సాయం చేస్తామని హామీ ఇచ్చారు; జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) 38 బృందాలను ఐదు రాష్ట్రాల్లో మోహరించింది, వాటిలో 14 ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రాథమిక పరిశీలన తర్వాత కేంద్రం తొలి విడత నిధులు త్వరలో విడుదల చేస్తుందని ఆశిస్తున్నారు; ఒడిశాకు కేంద్ర బృందం నవంబర్ 2న వచ్చింది. గతంలో కేంద్రం వైఖరి ఇలా ఉండేది: జాతీయ, రాష్ట్ర విపత్తు స్పందన నిధులు సహాయ చర్యల కోసమే కానీ పునరుద్ధరణ, పునర్నిర్మాణం కోసం కాదు. 15వ ఆర్థిక సంఘం సూచన తర్వాత, రెండేళ్ల క్రితం ఈ రెండు నిధుల్లో పునరుద్ధరణ, పునర్నిర్మాణం అంశాన్ని కూడా చేర్చారు. అయినా ప్రజా మౌలిక సదుపాయాలకు భారీ నష్టం జరిగినప్పుడు, ప్రభావిత రాష్ట్రాలపై భారం తగ్గించడానికి కేంద్రం అదనపు సాయం అందించాలి. హుద్‌హుద్ సమయంలో ప్రధాని మోదీ విశాఖను సందర్శించి రూ.1,000 కోట్ల మధ్యంతర సాయం ప్రకటించారు; ఇప్పుడు కూడా అదే వేగం, అదే ఔదార్యం కనిపించాలి. స్వల్పకాలిక సాయంతో పాటు శాశ్వత పునరుద్ధరణ ప్రాజెక్టులకు, ఉదాహరణకు తుపాన్లను తట్టుకునే విద్యుత్, సమాచార వ్యవస్థలకు, ఆర్థిక సాయంపై కేంద్రం దృష్టి పెట్టాలి. ప్రధాని మోదీ, ఆయన బృందం "సహకార సమాఖ్య" స్ఫూర్తితో వ్యవహరించాలి; ఇది పార్టీల రాజకీయం కాకుండా, తుపాను బాధిత ప్రజల పట్ల బాధ్యతగా ఉండాలి.

పనికొచ్చే పలుకు



అదే.. అసలు సంపద సూత్రం

ధనవంతులు కావాలని చాలామంది కలలుగంటారు. అందుకోసం మంచి ఉద్యోగం రావాలని, నెలకు లక్షల్లో జీతం సంపాదించాలని, పెద్ద వ్యాపారం చేయాలని ఆశపడుతుంటారు. నిజమే.. ఆదాయం పెరిగితే ఆర్థికంగా ఎదగడానికి అవకాశాలు మెరుగుపడతాయి. కానీ ఎక్కువ సంపాదించిన ప్రతి ఒక్కరూ ధనవంతులు కాలేరు. ఎందుకంటే సంపదకు సంపాదన ఒక్కటే కొలమానం కాదు. సంపాదించిన దాంట్లో ఎంత మిగుల్చుకుంటున్నామన్నదే అసలైన లెక్క! ఒక చిన్న ఉదాహరణ తీసుకుందాం. ఇద్దరు వ్యక్తులు ఒకే సంస్థలో పనిచేస్తున్నారు. మొదటి వ్యక్తి నెలకు రూ.లక్ష సంపాదిస్తున్నాడు. ఖరీదైన ఇల్లు, కారు, బ్రాండెడ్ దుస్తులు, రెస్టారెంట్లలో భోజనాలు.. ఇలా తన ఆదాయానికి తగ్గట్టుగా కాకుండా హోదాకు తగ్గట్టుగా జీవిస్తున్నాడు. నెలాఖరుకు అతని చేతిలో రూపాయి కూడా మిగలడం లేదు. అప్పుడప్పుడు క్రెడిట్ కార్డు బిల్లులు, ఈఎంఐలు అదనపు భారంగా మారుతున్నాయి. మరో వ్యక్తి నెలకు రూ.50 వేలు మాత్రమే సంపాదిస్తున్నాడు. కానీ తన ఖర్చులను రూ.30 వేలకే పరిమితం చేసుకున్నాడు. మిగిలిన రూ.20 వేలలో కొంత అత్యవసర అవసరాలకు, మరికొంత పెట్టుబడులకు కేటాయిస్తున్నాడు. ఇప్పుడు చెప్పండి.. ఈ ఇద్దరిలో ఆర్థికంగా బలంగా ఉన్నది ఎవరు?

నిజానికి సంపన్నులుగా మారే ప్రయాణం ఇక్కడే మొదలవుతుంది. మన ఆదాయం ఎంతన్నది ముఖ్యం కాదు.. ఆ ఆదాయాన్ని ఎలా నిర్వహిస్తున్నామన్నదే ముఖ్యం. నెలకు రూ.50 వేలు సంపాదిస్తూ రూ.30 వేలతో సంతోషంగా జీవించగలిగితే, మిగిలిన రూ.20 వేలు మన భవిష్యత్తుకు పునాది అవుతాయి. ఏడాదికి రూ.2.4 లక్షలు పొదుపు చేయగలుగుతాం. ఆ మొత్తాన్ని సరైన ప్రణాళికతో పెట్టుబడి పెడితే కాలక్రమంలో అది మరింత సంపదను సృష్టించే అవకాశం ఉంటుంది.

అయితే ఖర్చులు తగ్గించుకోవడమంటే జీవితంలోని ఆనందాలను చంపుకోవడం కాదు. అవసరాలకు, విలాసాలకు మధ్య తేడా గుర్తించడం. మనకు నిజంగా అవసరమా? లేక పక్కవారి దగ్గర ఉంది కాబట్టి మనకూ కావాలనుకుంటున్నామా? అనే ప్రశ్న వేసుకోవడం. ఇతరులను చూసి ఖరీదైన ఫోన్లు కొనడం, అవసరం లేకున్నా కొత్త వాహనాలు తీసుకోవడం, ఆదాయానికి మించిన ఇల్లు, ఈఎంఐలతో జీవితాన్ని భారంగా మార్చుకోవడం వంటివి ఆర్థిక స్వేచ్ఛకు అడ్డంకులు. ముఖ్యంగా సోషల్ మీడియాలో కనిపించే విలాసవంతమైన జీవితాలను చూసి మన జీవితాన్ని అంచనా వేసుకోవడం మానుకోవాలి.

మరో ముఖ్యమైన విషయం.. జీతం వచ్చిన తర్వాత మిగిలితే పొదుపు చేద్దామనుకోవద్దు. ముందుగా పొదుపు, పెట్టుబడులకు కొంత మొత్తం కేటాయించి, మిగిలిన దానితో ఖర్చులను నిర్వహించుకోవాలి. కనీసం 20 శాతం ఆదాయాన్ని భవిష్యత్తు కోసం కేటాయించే అలవాటు చేసుకోవాలి. అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవాలి. అప్పులను తగ్గించుకోవాలి. ఆదాయం పెరిగిన ప్రతిసారీ ఖర్చులను కూడా పెంచుకోవడం కాకుండా, పొదుపు, పెట్టుబడులను పెంచుకోవాలి.

గుర్తుంచుకోండి.. ధనవంతులు కావడానికి పక్కవారికంటే ఎక్కువ సంపాదించాల్సిన అవసరం లేదు. నిన్నటికంటే మెరుగైన ఆర్థిక నిర్ణయాలు తీసుకుంటే చాలు. మన సంపాదన మన కోసం పనిచేసేలా చేసుకోవాలి. ఖరీదైన వస్తువులు కొనగలగడం సంపన్నత కాదు.. అవసరమైనప్పుడు దబ్బు కోసం ఎవరి ముందూ చేయి చాచాల్సిన పరిస్థితి లేకపోవడమే నిజమైన ఆర్థిక స్వేచ్ఛ.

సంపాదన మీకు జీవనాన్ని ఇస్తుంది.. పొదుపు భద్రతను ఇస్తుంది.. తెలివైన పెట్టుబడులు భవిష్యత్తును నిర్మిస్తాయి. కాబట్టి ధనవంతులు కావాలంటే ముందుగా మీ ఆదాయాన్ని కాదు.. మీ జీవనశైలిని మార్చుకోండి!

ఊపిరి ఆగకముందే.. మేల్కోవాలి


దేశ రాజధాని ఢిల్లీ మరోసారి కాలుష్య కోరల్లో చిక్కుకుంది. వరుసగా మూడో రోజూ గాలి నాణ్యత అత్యంత ప్రమాదకర స్థాయికి చేరడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఏక్యూఐ 450 దాటడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. వాహనాల పొగ, నిర్మాణ ధూళి, పరిశ్రమల కాలుష్యం, పంట వ్యర్థాల దహనం, దీపావళి టపాసులు.. ఇలా అనేక కారణాలు ఢిల్లీ గాలిని విషతుల్యం చేస్తున్నాయి. ప్రతి ఏటా శీతాకాలం రాగానే ఇదే పరిస్థితి పునరావృతమవుతున్నా, ప్రభుత్వాల చర్యలు మాత్రం తాత్కాలికంగానే మిగులుతున్నాయి. కాలుష్యం ముదిరాక స్పందించడం కాకుండా, ముందస్తు ప్రణాళికతో నివారించాల్సిన అవసరం ఉందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అసలు ఢిల్లీని వెంటాడుతున్న ఈ కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారం ఎప్పుడు?



దేశ రాజధాని గాలి వరుసగా మూడో రోజు 'చాలా దారుణ' (వెరీ పూర్) స్థాయిలోనే ఉంది. గురువారం ఉదయం గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) సుమారు 370 వద్ద ఉంది; బుధవారం 24 గంటల సగటు 377కు చేరి, 288 రోజుల్లో అత్యంత చెత్త స్థాయిగా నమోదైంది. నగరంలోని 59 పర్యవేక్షణ కేంద్రాల్లో 18 నుంచి 22 కేంద్రాలు 'తీవ్ర' (సివియర్) స్థాయిని దాటాయి; జహంగీర్‌పురిలో సూచీ 459 వరకు వెళ్లింది. ఊపిరితిత్తుల్లోకి, అక్కడి నుంచి రక్తంలోకి చొచ్చుకుపోయే సూక్ష్మ ధూళి కణాలైన పీఎం2.5 ప్రధాన కాలుష్య కారకం. రాబోయే రెండు రోజులూ గాలి 'తీవ్ర' స్థాయికి చేరే అవకాశం ఉందని అంచనా; దీపావళి కూడా దగ్గరపడుతోంది. ఈ పరిస్థితి వెనుక ఉన్నది ప్రణాళికా వైఫల్యం. ఢిల్లీ పొగమంచుకు ఒక్క విలన్ లేడు, అందుకే ఒక్క మందూ దొరకలేదు. ఏడాదంతా నగరం గాలిని వాహనాలు, రోడ్లు, నిర్మాణ ధూళి, పరిశ్రమలు, చెత్త, బయోమాస్ దహనం, ఇంటి ఇంధనాలు కలుషితం చేస్తూనే ఉంటాయి. అక్టోబర్, నవంబర్‌లో పంజాబ్, హర్యానా తదితర చోట్ల పంట వ్యర్థాలను కాల్చడం వల్ల వచ్చే పొగ ఒక సీజనల్ పొరగా జతవుతుంది; దీపావళి టపాసులు ఆ గరిష్ఠ స్థాయిని మరింత పెంచుతాయి. పంట వ్యర్థాల దహనం వాటా రోజురోజుకూ మారుతుంటుంది. గత నవంబర్‌లో అది ఢిల్లీ పీఎం2.5లో సుమారు 7 శాతం మాత్రమే (అంతకుముందు ఏడాది సుమారు 20 శాతం), అయినా నెలలో చాలా రోజులు గాలి 'చాలా దారుణ' నుంచి 'తీవ్ర' స్థాయిలో ఉంది; స్థానిక ఉద్గారాలే కాలుష్యాన్ని ఎక్కువగా ఉంచాయని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ) తేల్చింది. ఈ రోజు నివేదికల ప్రకారం పంట వ్యర్థాల వాటా 20.2 శాతం, రవాణా వాటా 15.5 శాతం; అంటే వాటాలు మారినా, రెండూ ముఖ్యమే. వాతావరణం కూడా సహకరించదు: నవంబర్ నుంచి జనవరి వరకు ఢిల్లీ వాతావరణ పొర ఎత్తు ఒక కిలోమీటర్ కంటే తక్కువగా ఉంటుందని, పొర ఎత్తు తగ్గేకొద్దీ పీఎం2.5 పెరుగుతుందని 2026 అధ్యయనం చెబుతోంది. పంట కోతలు, పండుగలు, తగ్గే ఉష్ణోగ్రతలు, నిలిచిపోయే గాలి ప్రతి ఏటా ఒకే క్యాలెండర్‌లో వస్తాయి. అంటే ఇది అనూహ్య విపత్తు కాదు, ముందే తెలిసిన సమస్య.

సమయానికి రాని దానిని చెప్పాలంటే, స్పందనే. ఢిల్లీ అత్యవసర కార్యాచరణ 'గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్' (గ్రాప్) తీసుకోండి. గాలి ఇప్పటికే చెడిపోయాకే ఇది అమల్లోకి వస్తుంది; అంటే నష్టం మొదలయ్యాకే చర్య మొదలవుతుంది. ఈ సోమవారం గ్రాప్ రెండో దశ అమలైంది, అది కూడా సాయంత్రం ఐదు గంటలకు సూచీ 325కు చేరాక. 2025 జనవరి నుంచి 2026 జనవరి మధ్య 17 సార్లు గ్రాప్ అమలు చేయగా, 13 సార్లు గాలి నాణ్యత పరిమితిని దాటాకే చేశారు. సీఆర్ఈఏ అధ్యయనం ప్రకారం 2024 నవంబర్‌లో ఢిల్లీ పీఎం2.5 సగటు క్యూబిక్ మీటరుకు 249 మైక్రోగ్రాములు, ఎనిమిదేళ్లలో ఏ నవంబర్‌లోనూ ఇంత లేదు; తీవ్రమైన రోజు వస్తుందని వాతావరణ నిపుణులు హెచ్చరించినా కఠిన దశలను ఆలస్యంగా అమలు చేశారని కూడా అది ఎత్తిచూపింది. అసలు సమస్య అధికార పరిధి. ఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్ ఒకే గాలి ప్రదేశాన్ని (ఎయిర్‌షెడ్) పంచుకుంటాయి, కానీ పాలన రాష్ట్రాల వారీగా సాగుతుంది. ఈ అంతరాన్ని పూడ్చడానికే వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సీఏక్యూఎం) ఏర్పడింది. 2018-19 నుంచి కేంద్రం పంట వ్యర్థాల యంత్రాల కోసం రూ.3,120 కోట్లకు పైగా ఖర్చు చేసింది; ఈ ఏడాది పంట వ్యర్థాల దహనాన్ని పూర్తిగా ఆపాలని కమిషన్ ఆదేశించింది; పంట వ్యర్థాల దహనాన్ని అదుపు చేయడంలో విఫలమైన పంజాబ్ జిల్లా అధికారులకు షోకాజ్ నోటీసులు కూడా ఇచ్చింది. అయినా దహనాలు కొనసాగుతూనే ఉన్నాయి, ఒకరిపై ఒకరు నిందలు వేసే ఆట కూడా. ఈసారి మంచి విషయం ఏమిటంటే, ఢిల్లీ 2026-27 శీతాకాల కార్యాచరణ, నవంబర్ 1 నుంచి నిర్మాణ ధూళి నిషేధంతో సహా, పొగమంచు రాకముందే ప్రకటించారు, ఇది తరచూ జరగదు. గురుగ్రామ్ కూడా నవంబర్ 5 నుంచి 20 వరకు ధూళి పుట్టించే పనులను నిలిపివేసింది. సుప్రీంకోర్టు సర్టిఫైడ్ గ్రీన్ టపాసులను నవంబర్ 7-8 తేదీల్లో, పరిమిత సమయాల్లో (ఉదయం 6-7, రాత్రి 8-10) మాత్రమే అనుమతించింది. ఈ చర్యలు అవసరమే, కానీ చాలా ఆలస్యంగా వచ్చే అత్యవసర చర్యలు ఎంతవరకు పనిచేస్తాయన్నది ప్రశ్న.

ఒక నగరం ఊపిరాడకుండా ఉండటం యాదృచ్ఛికం కాదు. ప్రతి శీతాకాలాన్ని క్యాలెండర్‌లో ఉన్న పనిగా కాకుండా అత్యవసర పరిస్థితిగా నిర్వహించినప్పుడే ఇలా జరుగుతుంది. అవసరమైంది పన్నెండు నెలల స్వచ్ఛ వాయు నిబద్ధత. అధికారులు గాలి రీడింగ్ మీద కాదు, అంచనా మీద చర్య తీసుకోవాలి. ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు తీవ్రమైన కాలుష్యాన్ని రోజుల ముందే చూడగలవు; ఆ హెచ్చరికపైనే గ్రాప్ దశలను ముందుగానే అమలు చేయాలి. ముఖ్యంగా, ఏడాది పొడవునా ఒక్కొక్క మూలాన్ని ఒక్కొక్కటిగా పరిష్కరించాలి: శుభ్రమైన, ఎక్కువ ప్రజా రవాణా; యంత్రాలతో రోడ్ల ఊడ్పు; నిర్మాణ నిబంధనల అమలు; పరిశ్రమల్లో శుభ్రమైన ఇంధనం; చెత్త దంపింగ్ యార్డుల్లో, రోడ్డు పక్కన మంటలకు ముగింపు. రైతులను నిందించడం కాకుండా, వారికి యంత్రాలు, ప్రత్యామ్నాయాలు, ఆర్థిక ప్రోత్సాహకాలు సమయానికి చేరేలా చూడాలి; రాష్ట్రాల మధ్య సమన్వయం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో కనిపించాలి. పౌరులుగా మనమూ వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గించడం, టపాసులు కాల్చకపోవడం, చెత్త కాల్చకపోవడం వంటి చిన్న చర్యలతో వాటా పంచుకోవచ్చు. నవంబర్ 1న మొదలయ్యే ప్రణాళిక అప్పటికే ఆలస్యం. ఢిల్లీకి ప్రతి ఏటా మంటలార్పే పద్ధతి అవసరం లేదు; ప్రతి ఏటా అత్యవసర పరిస్థితే రాకుండా ఆపడమే అవసరం. ■




నిజమైన ఆనందం ఖరీదైన వస్తువుల్లోనో, విలాసవంతమైన జీవితంలోనో ఉండదు. ఇతరులతో పోల్చుకోకుండా, తమకు ఉన్నదానితో సంతృప్తి చెందుతూ, కావాల్సిన వాటిని మాత్రమే కోరుకునే మనస్తత్వంలో ఉంటుంది. పక్కవారి దగ్గర ఉన్నాయని మనకూ అన్నీ కావాలనుకోవడం మొదలుపెడితే జీవితమంతా పరుగులే మిగులుతాయి. ఎంత సంపాదించినా ఏదో ఒకటి తక్కువగానే అనిపిస్తుంది. కానీ మన అవసరాలకు, ఆశలకు మధ్య హద్దులు నిర్ణయించుకోగలిగితే మనసుకు ప్రశాంతత లభిస్తుంది. గుర్తుంచుకోండి.. సంపద అంటే ఎన్ని వస్తువులు సొంతం చేసుకున్నామన్నది కాదు.. ఉన్న జీవితాన్ని ఎంత ఆనందంగా అనుభవిస్తున్నామన్నదే!

-మహాదేవ

వింతల్లో వింతలు

టెన్నెస్సీలో కోతి కలకలం



అమెరికాలోని టెన్నెస్సీ రాష్ట్రం క్రాకెట్ కౌంటీలో ఓ వింత ఘటన చోటుచేసుకుంది. బ్రిమ్స్ కార్నర్ ప్రాంతంలో ఓ చిన్న గోధుమ రంగు కోతి పొలంలో తిరుగుతుండటాన్ని స్థానికులు గుర్తించారు. అంతేకాదు.. ఆ కోతిని చూసిన ఓ మహిళ పెంచుకుంటున్న కుక్క భయంతో ఇంట్లోకి రావడానికి కూడా నిరాకరించిందట! దీంతో రంగంలోకి దిగిన పోలీసులు కోతి కోసం గాలింపు చేపట్టారు. సమీపంలోని సఫారీ పార్కులో విచారించగా, తమ జంతువులన్నీ క్షేమంగానే ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. దీంతో ఈ కోతి ఎక్కడి నుంచి వచ్చిందన్నది మిస్టరీగా మారింది. కోతిని ఎవరైనా పెంచుకుంటున్నారా? లేక అది సొంతంగా విహారయాత్రకు వచ్చిందా? అంటూ పోలీసులు ఆరా తీస్తున్నారు.

ముంబయి ఇండియన్స్‌లో హార్దిక్ ఒంటరిగా ఫీలయ్యాడా? అంబటి రాయుడు కీలక వ్యాఖ్యలు

హార్దిక్ ముంబయిలో ఒంటరిగా ఫీలయ్యాడన్న రాయుడు
కెప్టెన్సీ వదిలి ఆటపై దృష్టి పెట్టాలని సూచన
ముంబయిలో కొనసాగితే ఆటగాడిగానే ఉండాలన్న అభిప్రాయం
జట్టు మారినా ఒక సీజన్ కెప్టెన్సీ వద్దని వ్యాఖ్య
పంజాబ్, చెన్నై జట్లు అతడికి మంచి ఎంపికలని వెల్లడి

ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా చుట్టూ ఐపీఎల్ 2027కు ముందే చర్చ మొదలైంది. అతడు జట్టును వీడనున్నాడంటూ ట్రేడ్ వార్తలు వస్తున్న నేపథ్యంలో భారత మాజీ క్రికెటర్, చెన్నై సూపర్ కింగ్స్ మాజీ ఆటగాడు అంబటి రాయుడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ముంబయి జట్టులో హార్దిక్ తనను ఒంటరిని చేశారన్న భావనకు గురై ఉండొచ్చని అభిప్రాయపడ్డాడు. అతడు మళ్లీ ముంబయి తరపున ఆడాలనుకుంటే కెప్టెన్సీ బాధ్యతలు వదులుకుని ఆటపై దృష్టి పెట్టాలని సూచించాడు. క్రిక్‌బజ్ చర్చలో పాల్గొన్న రాయుడు.. ముంబయిలో హార్దిక్ పరిస్థితి అంత బాలేదని వ్యాఖ్యానించాడు. జట్టులో తనను ఓ మూలకు నెట్టేసినట్టు ఓ ఆటగాడు భావిస్తే, ప్రతి విషయంలోనూ వెనక్కి చూసుకోవాల్సి వస్తుందని చెప్పాడు. డ్రెస్సింగ్ రూమ్‌లో అలాంటి పరిస్థితులు ఆట గాడి ప్రవర్తనపై ప్రభావం చూపుతాయని అభిప్రాయపడ్డాడు.



హార్దిక్ విషయంలో జరిగిన ప్రతిదానికీ అతడినే తప్పుబట్టలేమని, ఇతర కారణాలు కూడా ఉండొచ్చని పేర్కొన్నాడు. 2024 సీజన్‌కు ముందు గుజరాత్ టైటాన్స్ నుంచి ముంబయి ఇండియన్స్‌కు తిరిగొచ్చిన హార్దిక్‌కు ఫ్రాంచైజీ కెప్టెన్సీ అప్పగించింది. అప్పటివరకు జట్టుకు నాయకత్వం వహించిన రోహిత్ శర్మను తప్పించి హార్దిక్‌కు బాధ్యతలు ఇవ్వడంపై అభిమానుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. మైదానంలోనూ జట్టుకు ఆశించిన ఫలితాలు దక్కలేదు. హార్దిక్ నాయకత్వంలో మూడు సీజన్లలో ముంబయి ఒక్కసారి మాత్రమే ప్లేఆఫ్స్‌కు చేరినట్లు రాయుడు ప్రస్తావించాడు. హార్దిక్ ముంబయిలోనే కొనసాగాలనుకుంటే కెప్టెన్‌గా కాకుండా ఆటగాడిగా ఆడాలని రాయుడు సూచించాడు. తన సహజమైన ఆటను ఆస్వాదిస్తూ జట్టుకు మ్యాచ్ విన్నర్‌గా మారడంపై దృష్టి పెట్టాలని చెప్పాడు. ఒకవేళ ముంబయిని వీడితే కనీసం ఒక సీజన్ పాటు మరో జట్టులోనూ కెప్టెన్సీ చేపట్టకూడదని అభిప్రాయపడ్డాడు. ట్రేడ్ ద్వారా హార్దిక్ వెళ్లే అవకాశాలపైనా రాయుడు స్పందించాడు. పంజాబ్ కింగ్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లలో అతడికి మంచి వాతావరణం ఉండొచ్చని పేర్కొన్నాడు. అక్కడ కెప్టెన్సీ ఒత్తిడి లేకుండా తన ఆటపై దృష్టి పెట్టవచ్చని చెప్పాడు. కోల్‌కతా నైట్‌రైడర్స్ మాత్రం ప్రస్తుతం కెప్టెన్ అవసరంతో పాటు పలు సమస్యలు ఎదుర్కొంటున్నందున హార్దిక్‌కు అంత సులభమైన ఎంపిక కాదని విశ్లేషించాడు. హార్దిక్ పాండ్యా ముంబయి నుంచి పంజాబ్ కింగ్స్‌కు మారే అవకాశాలపై వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. అర్ష్‌దీప్ సింగ్‌తో ఆటగాళ్ల మార్పిడి ప్రతిపాదనపై చర్చలు జరుగుతున్నట్లు కొన్ని కథనాలు పేర్కొన్నాయి. అయితే ఈ ట్రేడ్‌పై ఆయా ఫ్రాంచైజీల నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు.

సెంచరీలు కాదు.. 43 పరుగుల ఇన్నింగ్సే బెస్ట్.. కోహ్లీ ఎంపిక వెనుక ఆసక్తికర కారణం

వన్డే క్రికెట్‌లో విరాట్ కోహ్లీ సాధించిన సెంచరీలు ఎన్నో. 183, 133 నాటౌట్ వంటి అద్భుత ఇన్నింగ్స్‌లు అభిమానుల మనసుల్లో చెరగని ముద్ర వేశాయి. అయితే తన కెరీర్‌లో అత్యుత్తమ వన్డే ఇన్నింగ్స్ ఏదంటే మాత్రం కోహ్లీ అనూహ్యమైన సమాధానం చెప్పాడు. 2013 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో ఇంగ్లండ్‌పై చేసిన 43 పరుగుల ఇన్నింగ్సే తనకు అత్యంత ప్రత్యేకమని వెల్లడించాడు. ఈరోజు 38వ పుట్టినరోజు జరుపుకొంటున్న కోహ్లీ.. ఈ సందర్భంగా స్టార్ స్పోర్ట్స్ రూపొందించిన ప్రత్యేక వీడియోలో పాల్గొన్నాడు. తన కెరీర్‌లోని కొన్ని కీలక ఇన్నింగ్స్‌లను జతచేసి, వాటిలో ఏది అత్యుత్తమమో ఎంచుకోవాలని నిర్వాహకులు కోరారు. తొలుత 2011 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో శ్రీలంకపై చేసిన 35 పరుగుల ఇన్నింగ్స్‌ను ఎంపిక చేశాడు. హోబర్ట్‌లో శ్రీలంకపై 2012లో చేసిన అజేయ 133 పరుగులు, 2023 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై చేసిన 85 పరుగుల కంటే దానికే ప్రాధాన్యమిచ్చాడు. ఇంగ్లండ్‌పై 2017లో చేసిన 122, దక్షిణాఫ్రికాపై 2018లో సాధించిన అజేయ 160 పరుగుల ఇన్నింగ్సులనూ పక్కనపెట్టాడు. అయితే చివరకు 2013 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో ఇంగ్లండ్‌పై చేసిన 43 పరుగుల ఇన్నింగ్స్ ముందు వాటన్నింటినీ వెనక్కి నెట్టాడు. వర్షం కారణంగా 20 ఓవర్లకు కుదించిన ఆ మ్యాచ్‌లో భారత్ 66 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ సమయంలో కోహ్లీ 34 బంతుల్లో 43 పరుగులు చేశాడు. రవీంద్ర జడేజాతో కలిసి ఆరో వికెట్‌కు 47 పరుగులు జోడించాడు. జడేజా 33 పరుగులతో రాణించడంతో భారత్ 129 పరుగులు చేసింది. అనంతరం ఇంగ్లండ్‌ను 124 పరుగులకే పరిమితం చేసి ఐదు పరుగుల తేడాతో విజయం సాధించింది. పాకిస్థాన్‌పై 2012 ఆసియా కప్‌లో చేసిన 183, దక్షిణాఫ్రికాపై 2015లో సాధించిన 138, 2015 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై చేసిన 107 పరుగుల ఇన్నింగ్స్‌లను కూడా కాదని కోహ్లీ ఎంచుకున్న ఇన్నింగ్స్ ఇది. భారీ వ్యక్తిగత స్కోర్ల కంటే జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు చేసిన కీలక పరుగులకే కోహ్లీ ఎక్కువ విలువ ఇస్తున్నాడని దీని ద్వారా స్పష్టమవుతోంది.



స్పోర్ట్స్

సీఎస్‌కే, ఎస్‌ఆర్‌హెచ్ మధ్య మెగా డీల్..

సగం ధరకే లివింగ్‌స్టోన్ చెన్నై గూటికి!

ఐపీఎల్ 2027 ట్రేడింగ్ విండోలో భారీ డీల్
చెన్నై జట్టులోకి ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్, జాక్ ఎడ్వర్డ్స్
సన్‌రైజర్స్ హైదరాబాద్‌లోకి ఖలీల్ అహ్మద్, నాథన్ ఎల్లిస్
రూ.13 కోట్ల లివింగ్‌స్టోన్‌ను సగం ధరకే సొంతం చేసుకున్న సీఎస్‌కే
పేస్ బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేసుకున్న హైదరాబాద్ ఫ్రాంచైజీ



ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు ట్రేడింగ్ విండోలో ఒక భారీ ఒప్పందం కుదిరింది. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) ఫ్రాంచైజీల మధ్య పలువురు కీలక ఆటగాళ్లు చేతులు మారారు. ఈ మెగా ట్రేడ్‌లో భాగంగా, ఇంగ్లండ్ స్టార్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్, ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ చెన్నై జట్టులోకి రాగా, భారత లెఫ్ట్ ఆర్మ్ పేసర్ ఖలీల్ అహ్మద్, ఆసీస్ పేసర్ నాథన్ ఎల్లిస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ గూటికి చేరారు. ఈ ఒప్పందంలో అత్యంత కీలకమైన అంశం లివింగ్‌స్టోన్ బదిలీ. గతంలో ఎస్‌ఆర్‌హెచ్ అతడిని రూ.13 కోట్లకు కొనుగోలు చేయగా, ఇప్పుడు చెన్నై సగాని కన్నా తక్కువ ధరకు, అంటే కేవలం రూ.6 కోట్లకు సొంతం చేసుకుంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో లివింగ్‌స్టోన్ కేవలం రెండు మ్యాచ్‌లే ఆడి 15 పరుగులే చేసి తీవ్రంగా నిరాశపరిచాడు. ఇక, గాయం కారణంగా గత సీజన్‌కు దూరమైన జాక్ ఎడ్వర్డ్స్‌ను సీఎస్‌కే అతని ప్రస్తుత ఫీజు రూ.3 కోట్లతో జట్టులోకి తీసుకుంది. ఈ ఇద్దరు ఓవర్సీస్ ఆల్‌రౌండర్ల చేరికతో చెన్నై జట్టు సమతూకం పెంచుకుంది. మరోవైపు, సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ పేస్ బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేసుకుంది. గతంలో 2018 నుంచి 2021 వరకు ఎస్‌ఆర్‌హెచ్‌కే ప్రాతినిధ్యం వహించిన ఖలీల్ అహ్మద్, తన ప్రస్తుత ఫీజు రూ.4.8 కోట్లతో తిరిగి సొంత జట్టులోకి వచ్చాడు. ఐపీఎల్ 2025లో సీఎస్‌కే తరపున 14 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు తీసిన ఖలీల్, 2026లో గాయం కారణంగా ఐదు మ్యాచ్‌లకే పరిమితమయ్యాడు. డెత్ ఓవర్ల స్పెషలిస్ట్‌గా పేరున్న నాథన్ ఎల్లిస్ రూ.2 కోట్ల ఫీజుతో హైదరాబాద్ జట్టులోకి చేరాడు. అతను కూడా గత సీజన్‌లో గాయం కారణంగా ఆడలేదు. ప్రస్తుత ట్రేడింగ్ విండోలో ఇది మూడో పెద్ద డీల్. ఇప్పటికే లక్నో నుంచి రిషభ్ పంత్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ తిరిగి తీసుకోగా, కుల్దీప్ యాదవ్‌ను వదులుకుంది. అలాగే, ఢిల్లీ నుంచి టి. నటరాజన్ తిరిగి ఎస్‌ఆర్‌హెచ్‌లోకి రాగా, బదులుగా జీషాన్ అన్సారీ ఢిల్లీకి మారిన సంగతి తెలిసిందే.

శ్రద్ధా కపూర్ ట్రెడిషనల్ లుక్ అదుర్స్.. ఆభరణాలే స్పెషల్ అట్రాక్షన్!



ముదురు ఎరుపు రంగు ఎంబ్రాయిడరీ చీరలో సోనం బజ్వా అద్భుతంగా కనిపిస్తున్నారు

బాలీవుడ్ అందాల భామ శ్రద్ధా కపూర్ తన సహజమైన నవ్వుతో, ముచ్చటైన సంప్రదాయ లుక్స్‌తో ఎంతోమంది అభిమానుల హృదయాలను కొల్లగొడుతుంటారు. తాజాగా ఈ పండుగ వేడుకలో పర్పుల్ అండ్ మెజెంటా కాంబినేషన్‌లోని పట్టు చీరను ధరించి, నిండైన భారతీయ నారీమణిలా మెరిసిపోయారు. పద్ధతైన లుక్‌లో కనిపిస్తున్న శ్రద్ధా ధరించిన అవుట్‌ఫిట్, ఆభరణాల ప్రైస్ బ్రేకిడౌన్‌తో పాటు ఆమె నటిస్తున్న లేటెస్ట్ సినిమా విశేషాలు ఇప్పుడు సరళంగా చూద్దాం..

పర్పుల్ సిల్క్ శారీ అండ్ డిజైనర్ గాజులు:

ఈ ట్రెడిషనల్ లుక్ కోసం శ్రద్ధా కపూర్ రాయల్ పర్పుల్ రంగులో ఉన్న పట్టు చీరను ఎంచుకున్నారు. ఈ చీరకు ఉన్న రిచ్ మెజెంటా కలర్ బార్డర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ పర్పుల్ సిల్క్ శారీ అంచనా ధర సుమారు రూ. 25,000గా ఉంది. ఇక దీనికి తోడుగా చేతులకు ధరించిన 'గ్రీన్ ఁ గోల్డ్ బ్యాంగిల్స్ సెట్' రూ. 6,000 ఆమె సంప్రదాయ లుక్‌కి మరింత శోభను తెచ్చిపెట్టింది.

గోల్డ్ చోకర్ అండ్ ట్రెడిషనల్ ఆభరణాలు:

ఈ చీరకు పర్‌ఫెక్ట్ మ్యాచ్ అయ్యేలా శ్రద్ధా క్లాసీగా ఉండే సాంప్రదాయ బంగారు ఆభరణాలను ధరించారు. మెడలో వేసుకున్న గోల్డ్-టోన్డ్ చోకర్ నెక్లెస్ అంచనా ధర రూ. 8,000 కాగా, ట్రెడిషనల్ గోల్డ్ జుంకా ఇయర్ రింగ్స్ ధర సుమారు రూ. 12,000గా ఉంది. అలాగే కాళ్లకు గోల్డ్ పట్టీలు రూ. 3,000 మరియు ఎంబెల్లిష్డ్ జుత్తీ ఫ్లాట్స్ రూ. 5,000 ధరించి ఎంతో పద్ధతిగా, దేవకన్యలా మెరిసిపోయారు.

లావణి నృత్యం నేపథ్యంలో 'ఈథా' సినిమా:

గ్లామర్ పాత్రలతోనే కాకుండా వైవిధ్యమైన కథలతో అలరించే శ్రద్ధా కపూర్, ఇప్పుడు మహారాష్ట్ర సంప్రదాయ నృత్యకళ లావణి నేపథ్యంలో తెరకెక్కుతున్న 'ఈథా' అనే బాలీవుడ్ చిత్రంలో నటిస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ లావణి కళాకారిణి విఠాబాయి భౌ మాంగ్ నారాయణ్‌గావ్కర్ జీవితం ఆధారంగా ఈ చిత్రం రూపొందుతోంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో శ్రద్ధా కళాకారులతో కలిసి వేసిన లావణి డాన్స్ వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది.

లక్ష్మణ్ ఉటేకార్ దర్శకత్వం.. నానా పటేకర్ కీలక పాత్ర:

దర్శకుడు లక్ష్మణ్ ఉటేకార్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని మద్దాక్ ఫిల్మ్స్ మరియు కత్పుత్లీ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇందులో శ్రద్ధా 'ఈథా బాయి' పాత్రలో అలరించనుండగా, దివంగత నటుడు నానా పటేకర్ ఒక ముఖ్యమైన పాత్రలో కనిపిస్తున్నారు. ఇక ప్రభాస్ సరసన 'సాహో' సినిమాతో తెలుగు ప్రేక్షకులను మెప్పించిన శ్రద్ధా, ఈ బయోపిక్ చిత్రంతో బాలీవుడ్‌లో మరో భారీ హిట్‌ను తన ఖాతాలో వేసుకోవడానికి సిద్ధమవుతున్నారు.ఇక మొత్తానికి చూస్తే, ఎక్కువ హంగులు లేకుండానే నిండైన పట్టు చీర, సాంప్రదాయ ఆభరణాలతో శ్రద్ధా కపూర్ చూపించిన ఈ క్లాసీ ఎలిగంట్ లుక్ అందరినీ విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఒకవైపు సంప్రదాయ ఫ్యాషన్ సెన్స్‌తో అలరిస్తూనే, మరోవైపు 'ఈథా' వంటి వైవిధ్యమైన సినిమాలతో శ్రద్ధా బాలీవుడ్‌లో తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు.



రీగల్ జర్దోజీ లెహంగా లుక్‌లో చెత్నా పాండే స్టన్



PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com